# విశాల భారతి

08-12-2025

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ | సంపుటి:3 సంచిక: 338




## నిన్నటి వరకు ఒక లెక్క
## గ్లోబల్ సమ్మిట్ తర్వాత
# మరో లెక్క

### కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సందేశం

హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం
యువతకు కొలువులు, రైతులకు దన్ను, మహిళలకు భరోసా ఇచ్చామన్నారు
తెలంగాణను దేశ గ్రోత్ ఇంజిన్‌గా మార్చడమే లక్ష్యమని స్పష్టీకరణ
గ్లోబల్ సమ్మిట్ తర్వాత తెలంగాణలో కొత్త లెక్క మొదలవుతుందని వ్యాఖ్య
తమ ప్రస్థానం జాతి కోసం జనహితం కోసం సాగిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు
లోతైన మథనంతో 'విజన్2047' మార్గదర్శక పత్రాన్ని సిద్ధం చేశామని వెల్లడించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ పాలన రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతిష్టాత్మక 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 'నేపథ్యంలో కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తమ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "నిన్నటి వరకు ఒక లెక్క... రేపటి 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ' తర్వాత మరో లెక్క" అంటూ రాష్ట్ర భవిష్యత్తుపై తమ మహా సంకల్పాన్ని ప్రకటించారు. తెలంగాణ ప్రజల ఓటుతో అధికారం చేపట్టిన తర్వాత తమ ప్రస్థానం జాతి కోసం.. జనహితం కోసం సాగిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పాలన శిథిలాల కింద ఉన్న నవతరానికి తాము కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోశామని.. అలాగే రుణభారంతో ఉన్న రైతులకు దన్నుగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిపామని పేర్కొన్నారు. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థిక మద్దతు ఇచ్చి.. వారిని అదానీ, అంబానీల స్థాయిలో వ్యాపార రంగంలో నిలబెట్టామని తెలిపారు. బలహీన వర్గాల వందేళ్ల ఆకాంక్షలను కుల లెక్కలతో కొత్త మలుపులు తిప్పామని, వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమానికి నిజమైన సార్థకత చేశామని ఉద్ఘాటించారు. విద్య ఒక్కటే బతుకు తెరువుకు బ్రహ్మాస్త్రం అని నమ్మి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణానికి పునాదులు వేసినట్లు.. అలాగే స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి

మిగతా 2లో..

*8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ సమ్మిట్ షెడ్యూల్ ను ఖరారు చేసింది. ఈ నెల 8 మధ్యాహ్నం ఒంటి గంటకు సదస్సు లాంఛనంగా ప్రారంభం కానుంది. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, విద్యావేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు తరలిరానున్నారు. ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, ఐటీ-సెమీకండక్టర్లు, విద్య ,వైద్యం, పర్యాటకం, సిక్యా ఎంటర్టైన్మెంట్, తాజ్ హోటల్స్ తదితరులు వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు చర్చల్లో పాల్గొంటారు. పీవీ సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపిచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా వంటి క్రీడా ప్రముఖులు ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సెషన్‌లో పాల్గొంటారు.*



## ఆకాశంపై ఇండిగో ఆధిపత్యం

- ఇండిగో ఎయిర్‌లైన్స్ ఇండియాకు చుక్కలు చూపించింది
- 5 రోజులనుండి వందల సంఖ్యలో విమానాలు రద్దయ్యాయి
- ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా ఉందని మంత్రి చెబుతున్నారు
- అంతర్జాతీయ సర్వీసులు పెద్దగా దెబ్బతినకపోవడం గమనార్హం
- పైలట్ల వారాంత విశ్రాంతి నిబంధనను ఒక్కసారిగా ఉపసంహరణ
- ప్రభుత్వాన్ని ఇండిగో బలవంతం చేసిందని తీవ్రమైన ఆరోపణలు

02

## రైజింగ్ కాదు.. అవినీతి తెలంగాణ

రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై బీజేపీ నేతలు నిప్పులు చెరిగారు
ధర్నా చౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు
రెండేళ్ల కాంగ్రెస్ పాలనను నయవంచనగా పోల్చారు
హాజరుకానున్న 44కు పైగా దేశాల ప్రతినిధులు
రైజింగ్ తెలంగాణ.. డ్రగ్స్ కల్చర్‌గా మారిపోయిందన్నారు
లా అండ్ ఆర్డర్ కుప్పకూలిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు
రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని మండిపడ్డారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై బీజేపీ నేతలు నిప్పులు చెరిగారు. ఆదివారం హైదరాబాద్‌లో ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన పేరుతో.. కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలతో కూడిన ఛార్జ్‌షీట్‌ను ఈ కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..

మిగతా 2లో..





## ఎక్కడి భూ సమస్యలు అక్కడే!

- తెలంగాణలో భూమి సమస్యల బాధ అంతా ఇంతా కాదు
- దశాబ్దాల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది
- బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో పోర్టల్‌ను తీసుకువచ్చింది
- కాంగ్రెస్ భూభారతి పేరుతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చారు
- అయినప్పటికీ భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు
- 20 లక్షలకు పైగా భూమి సమస్యలు అలాగే పేరుకుపోయాయి

03

## సీఎం రేవంత్‌కి కిషన్ రెడ్డి ఛాలెంజ్

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తేడా లేదని కిషన్ రెడ్డి అన్నారు
- ఈ రెండు కుటుంబ, అవినీతి పార్టీలేనని విమర్శించారు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని తెలిపారు
- హామీలను పేర్కొంటూ ఛార్జ్‌షీట్ విడుదల చేశారు
- నయవంచన పాలన పేరుతో కార్యక్రమం చేపట్టారు
- అప్పుల రాష్ట్రంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు
- గులాబీ పోయి చేయి వచ్చినా దోపిడీ ఆగలేదని పేర్కొన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**


కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తేడా లేదని.. ఈ రెండు కుటుంబ, అవినీతి పార్టీలేనని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని.. కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీయాలంటూ తెలంగాణ ప్రజలకు ఈ సందర్భంగా కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లో ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నెరవేర్చని హామీలను పేర్కొంటూ ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ ధర్నాలో బీజేపీ ఎమ్మెల్యేలు, నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ..

మిగతా 2లో..


# గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం!

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రభుత్వం సిద్ధమైంది
అత్యంత ప్రతిష్టాత్మక నిర్వహణకు పూర్తి అయిన ఏర్పాట్లు
భారీగా పెట్టుబడులకు ఆహ్వానం, ప్రభుత్వ సహకారం పై చర్చ
హాజరుకానున్న 44కు పైగా దేశాల ప్రతినిధులు
ఇవాళ మధ్నాహ్నం సదస్సును ప్రారంభించనున్న గవర్నర్
రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి
నీతి ఆయోగ్, ఐఎస్‌బీ సూచనలతో విజన్ డాక్యుమెంట్ తుది మెరుగులు

02





## రేవంత్ రెడ్డిని సాగర్‌లో పడేస్తా




సీఎం రేవంత్ చేసిన విమర్శలను హరీష్ రావు ఖండించారు
సిద్దిపేటకు రా రంగనాయక సాగర్‌లో బండ కట్టి నిన్ను ఎత్తేస్తా
నీళ్లుండి నువ్వు మునిగితే కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నట్టు
నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ధ్వజమెత్తారు
మొక్కజొన్న రైతులకు బకాయిలు చెల్లించాలి డిమాండ్ చేశారు
కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు

03



## వెయ్యి అడుగుల లోయలో పడిన కారు


- మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది
- ఈ ఘటనలో ఆరుగుడు మరణించారు
- ఇన్నోవా కారు లోయలో పడిపోయింది
- సప్తశృంగి కోటలోని గణపతి పాయింట్ వద్ద ఘటన
- భక్తులందరూ సప్తశృగి మాత దర్శనం చేసుకొని వస్తున్నారు
- ఈ ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు

03

# గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం!

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రభుత్వం సిద్ధమైంది
- అత్యంత ప్రతిష్టాత్మక నిర్వహణకు పూర్తి అయిన ఏర్పాట్లు
- భారీగా పెట్టుబడులకు ఆహ్వానం, ప్రభుత్వ సహకారంపై చర్చ
- హాజరుకానున్న 44కు పైగా దేశాల ప్రతినిధులు
- ఇవాళ మధ్యాహ్నం సదస్సును ప్రారంభించనున్న గవర్నర్
- రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి
- నీతి ఆయోగ్, ఐఎస్‌బీ సూచనలతో విజన్ డాక్యుమెంట్ తుది మెరుగులు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:




తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్ కు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవ్యాప్తంగా పేరెన్నికగల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్ లో పాల్గొంటున్నారు. ఒక్క అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు తరలివస్తున్నారు. నేటి మధ్యాహ్నం ఒకటిన్నరకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా సమ్మిట్ ను ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభవేడుకకు హాజరవుతున్నారు. సమ్మిట్ లో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియాటెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా, తదితరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వంవైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఆహుతులకు వివరిస్తారు.

**రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి**

ఇందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. వచ్చిన అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామాగ్రిని సిద్ధంచేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీ తో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, 3డీ ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్ లో ఎల్ఈడీ స్క్రీన్స్ తో ఈ విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు అయిన బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సదస్సు జరిగే రెండు రోజుల పాటు హాజరైన అందరికీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటలతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి.

ఇక అతిథులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని ప్రభుత్వం తరపున అందించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో పాటు, పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈ సావనీర్ లో పొందుపరుస్తారు. అలాగే తెలంగాణకే ప్రత్యేకమైన వంటలైన ఇప్ప పువ్వు లడ్డు, సకినాలు, చెక్కలు, బాదం కీ జాలి, నువ్వుల ఉండలు, మక్క పేలాలతో కూడిన మరో ప్రత్యేక బాస్కెట్ ను కూడా అతిథులకు అందించనున్నారు.

ఈ క్రమంలోనే నీతి ఆయోగ్, ఐఎస్‌బీ సూచనలతో విజన్ డాక్యుమెంట్ తుది మెరుగులు దిద్దారు. రెండు రోజుల సమ్మిట్‌లో 27 ప్రత్యేక సెషన్లలో టెక్నాలజీ, హెల్త్‌కేర్, ఎనర్జీ, ఆర్థిక అభివృద్ధి వంటి 15 ప్రధాన రంగాల్లో చర్చలు నిర్వహిస్తారు. సమ్మిట్ కోసం 50 ఆర్టీసీ బస్సులను వినియోగిస్తున్నారు. పార్కింగ్ ప్లేస్ నుంచి సమ్మిట్‌కి 12 ఎలక్ట్రిక్ బస్సుల్లో డెలిగేట్‌స్‌ను తరలిస్తారు. 6 వేల మంది పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. వెయ్యి సీసీ కెమెరాలు, డ్రోన్లతో సమ్మిట్ చుట్టూ నిఘా ఏర్పాటు చేశారు. మరోవైపు ఇండిగో సంక్షోభంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. అవసరమైతే సమ్మిట్‌కు వచ్చే అతిథుల కోసం ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేస్తోంది.

సమ్మిట్ ద్వారా 3 ఫైనాన్షియల్ మెగాగోల్స్ సాధించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 1. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ, భారత జీడీపీలో 10శాతం వాటా, 2. 2047 నాటికి తెలంగాణాను నెట్ జీరో రాష్ట్రంగా తీర్చిదిద్దడం, 3. కోటి మంది తెలంగాణ మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడం. మానవ వనరుల అభివృద్ధి, ఉత్పాదకత, ఆవిష్కరణ, పెట్టుబడులు, పొదుపులను మూడు స్తంభాలుగా చేసుకుని ఈ లక్ష్యాలను సాధించే దిశగా రాష్ట్రప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. 6 వేల మంది పోలీసులతో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశామని.. డెలిగేట్‌స్‌కు పైలట్ వాహనాలను సిద్ధం చేశామని వివరించారు. సమ్మిట్ జరిగి రోజుల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని తెలిపారు. ఇక గ్లోబల్ సమ్మిట్‌కు 50 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. విజిటర్స్ కోసం 10 ప్రాంతాల నుంచి బస్సులు నడిపించబోతున్నామని వెల్లడించారు.

ఇదిలా ఉండగా రైజింగ్ తెలంగాణ విజన్ 2047 లక్ష్యాలు అందరికీ అర్థమవ్వడం కోసం నగరంలో పలు ప్రాంతాల్లో డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు. దుర్గం చెరువులో స్పెషల్ అట్రాక్షన్‌గా గ్లోబ్ ఆకారంలో తేలియాడే ప్రొజెక్షన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ లోగోను ఇన్‌లిట్ టెక్నిక్‌తో ప్రదర్శించనున్నారు. అలాగే హుస్సేన్‌సాగర్‌లో వాటర్ ప్రొజెక్షన్‌తో భారత్ ఫ్యూచర్ సిటీ, మహిళా సాధికారత, యువతరైతు ప్రధాన కార్యక్రమాలు, అలాగే 3 ట్రిలియన్ ఎకానమీ టార్గెట్ లాంటి అంశాలను ప్రదర్శించనున్నారు. అలాగే శంషాబాద్ విమానాశ్రయం నుంచి సమిట్ వేదిక వరకు వెళ్లే రోడ్‌పై భారీ డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాట్లు చేశారు. దీనిపై భారత్ ఫ్యూచర్ సిటీకి ఎలా చేరుకోవాలి, ఎంతదూరం అనే వివరాలు చూపించనున్నారు. ఫ్యూచర్ సిటీ ప్లాన్, డిజిట్ స్క్రీన్లపై విజువల్స్, అలాగే సమిట్ బ్రోచర్లు అందుబాటులో ఉంచనున్నారు.

## 'నిన్నటి వరకు ఒక లెక్క గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క'

( మొదటిపేజీ తరువాయి )

శ్రీకారం చుట్టినట్లు వివరించారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం, రూ.500కే గ్యాస్, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే గొప్ప పథకాలన్నీ ఈ రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ రెండేళ్ల సంక్షేమంతో తాము సరిపెట్టలేదని.. స్వతంత్ర భారత ప్రయాణం వందేళ్ల మైలురాయికి చేరే 2047 నాటికి తెలంగాణ ఎలా ఉండాలనే దానిపై లోతైన మథనంతో 'విజన్2047' మార్గదర్శక పత్రాన్ని సిద్ధం చేశామని తెలిపారు.



ఈ సందర్భంగా నిర్వహించబోతున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ వేదికపై #తెలంగాణ రైజింగ్ రీ సౌండ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని.. భారత దేశ గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణను మార్చడానికి సర్వం సిద్ధం చేశామని ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క అని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా.. సచివాలయాన్ని జాతీయ పతాక కాంతులతో అలంకరించడం జరిగింది. ఇది రాష్ట్ర ప్రగతి, గౌరవానికి ప్రతీకగా నిలిచింది. "మీ ఆశీర్వాదమే నా ఆయుధం" అంటూ సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ ప్రజల సహకారం ఉన్నంత వరకు 'తెలంగాణ రైజింగ్' కు తిరుగు లేదని ప్రకటించారు.

విశ్వనగరం హైదరాబాద్‌లో ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన పలు బహుళ జాతి సంస్థలు.. అతి పెద్ద కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. దీంతో ఈ నగరం ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. తాజాగా హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీ వేదికగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సోమవారం ప్రారంభం కానుంది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించే ఈ సదస్సుకు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు, అతిథులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. వివిధ రహదారులకు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వ్యక్తులు, సంస్థల పేర్లు పెట్టాలని నిర్ణయించారు. రావిర్యాల వద్ద నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానించే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రహదారికి రతన్ టాటాపేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. భారత్‌లో సాంకేతికతతో పాటు పారిశ్రామిక రంగంలో ఆయన చేసిన కృషికి నివాళిగా ఇప్పటికే రావిర్యాల వద్ద ఇంటర్ చేంజ్‌కు టాటా పేరు పెట్టిన సంగతి తెలిసిందే.

యూనైటెడ్ స్టేట్స్ కాన్సులేట్ జనరల్ పక్కనే ఉన్న రహదారికి డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ అని పేరు పెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఇప్పటికే కేంద్ర విదేశీ మంత్రిత్వ శాఖతోపాటు అమెరికా రాయబార కార్యాలయానికి లేఖ సైతం రాసింది. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రాంతానికి గూగుల్ స్ట్రీట్ అని పిలుస్తారన్న విషయం విదితమే. అలాగే మైక్రోసాఫ్ట్ రోడ్డు, విప్రో జంక్షన్ పేర్లపై ప్రభుత్వం పరిశీలన చేస్తోంది. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ వినూత్న ఆలోచనకు తెర తీసినట్లు తెలుస్తోంది. నగరంలోని రహదారులకు అంతర్జాతీయ కంపెనీలు - ప్రముఖులకు గౌరవంగా పేర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అదే విధంగా రాజమౌళి, రితేష్ దేశ్‌ముఖ్, సుకుమార్, గునీత్ మోంగా, అనుపమా చోప్రా వంటి సినీ ప్రముఖులు క్రియేటివ్ సెంచరీ, సాఫ్ట్ పవన్ అండ్ ఎంటర్టైన్మెంట్ చర్చలో పాల్గొంటారు. కాగా, ఈ నెల 9న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను ఆవిష్కరిస్తుంది. తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను ఈ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో అన్ని రంగాల్లో భవిష్యత్తు తెలంగాణ అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు, టెక్నాలజీ భాగస్వామ్యాలు, నూతన ఆవిష్కరణల దిశగా సమగ్ర ప్రణాళికలను పొందుపరిచారు.

## ఆకాశంపై ఇండిగో ఆధిపత్యం




- ఇండిగో ఎయిర్‌లైన్స్ ఇండియాకు చుక్కలు చూపించింది
- 5 రోజులనుండి వందల సంఖ్యలో విమానాలు రద్దయ్యాయి
- ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా ఉందని మంత్రి చెబుతున్నారు
- అంతర్జాతీయ సర్వీసులు పెద్దగా దెబ్బతినకపోవడం గమనార్హం
- పైలట్ల వారాంత విశ్రాంతి నిబంధనను ఒక్కసారిగా ఉపసంహరణ
- ప్రభుత్వాన్ని ఇండిగో బలవంతం చేసిందని తీవ్రమైన ఆరోపణలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఇండియాకు చుక్కలు చూపించిన ఇండిగో ఎయిర్‌లైన్స్ దెబ్బకు 5 రోజులనుండి రోజుకు వందల సంఖ్యలో విమానాలు రద్దవ్వడంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాలలో రాత్రిళ్లు వేలాది మంది ప్రయాణికులు ఇరుక్కుపోయారు. అష్టకష్టాలు పడుతున్నారు. ఇంకా పరిస్థితి అదుపులోకి రాలేదు. ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా ఉందని మంత్రి చెబుతున్నారు. దేశీయ సర్వీసులు అత్యధికంగా రద్దవ్వగా, అంతర్జాతీయ సర్వీసులు మాత్రం పెద్దగా దెబ్బతినకపోవడం గమనార్హం. కాగా, ఇదే సమయంలో డీజీసీఏ పైలట్ల వారాంత విశ్రాంతి నిబంధనను ఒక్కసారిగా ఉపసంహరించుకోవడంతో సోషల్ మీడియా మండిపడింది. దీన్ని బ్లాక్‌మెయిల్‌గా అభివర్ణిస్తూ, ప్రభుత్వాన్ని ఇండిగో బలవంతం చేసిందని తీవ్రమైన ఆరోపణలు ట్వీట్లు, పోస్టుల రూపంలో వెల్లువెత్తాయి. ఈ విషయంపై పైలట్ల సంఘం కూడా ఇండిగోను తీవ్రంగా అక్షేపించింది.

ఈ సంక్షోభం సాధారణ షెడ్యూలింగ్ సమస్య కాదని ప్రజలు నమ్మడం మొదలుపెట్టారు. ఇండిగోకి 18 నెలల ముందే కొత్త ఎఫ్‌డీటీఎల్ విశ్రాంతి నిబంధనలు వర్తించబోతున్నట్లు సమాచారం ఉన్నా, తగినట్లుగా సిబ్బందిని నియమించకపోవడం, షెడ్యూల్ విస్తరణ యథావిధిగా కొనసాగించడం, చివర్లో దేశవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించడం——ఇది పూర్తిగా ఓ ప్రణాళిక ప్రకారం ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసిన చర్యలా ఉందని విమర్శకులు అంటున్నారు. ప్రయాణికుల అసహనం పెరిగినంత మేరకు ప్రభుత్వం పై కూడా ఒత్తిడి పెరిగింది. అదే సమయంలో డీజీసీఏ రాత్రికి రాత్రే వివాదాస్పద నిబంధనను వెనక్కి తీసుకోవడం ఆరోపణలకు మరింత ఊతమిచ్చింది.

ఈ మొత్తం చర్యలో తీవ్రంగా నష్టపోయినవారు, బాధపడ్డవారు మాత్రం నిరపరాధ ప్రయాణికులే. ఫ్లైట్ రద్దులు, అర్ధరాత్రి విమానాశ్రయాల్లో గందరగోళం, ఎక్కడికీ చేరలేకపోయిన ప్రజలు, తిండి, నిద్ర లేకపోవడం, ఇవన్నీ ఒక పెద్ద ఎయిర్‌లైన్ తన వ్యవస్థను తిరిగి తనకిష్టం వచ్చిన రీతిలో నిర్వచించుకోవడానికి ప్రదర్శించిన రాజకీయమని నిపుణులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఇండిగో ఈ వ్యవహారంలో అన్ని లక్ష్మణరేఖలు దాటేసిందని, ప్రజల ప్రాణాల కన్నా, డబ్బులే ముఖ్యమని భావించిందని సోషల్ మీడియా తీవ్రంగా విమర్శించింది. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇండిగోను క్షమించడానికి వీల్లేదని మేధావివర్గాలు కేంద్రానికి విన్నవించారు.

**ప్రపంచ భద్రతాప్రమాణాల దిశగా కదిలిన భారత్, వెనకడుగు ఎందుకు వేసినట్లు?**

పైలట్ అలసట ప్రపంచ విమానాయాన రంగంలో అత్యంత ప్రమాదకరమైన భద్రతా సమస్యగా పరిగణించబడుతుంది. ఐసీఏఓ, ఈఏఎస్ఏ, ఎఫ్ఏఏ వంటి అంతర్జాతీయ సంస్థలు, విశ్రాంతి అంటే కేవలం విశ్రాంతిదానిని ఎలాంటి సెలవుతోనూ మార్చరాదని స్పష్టంగా తమ నిబంధనలలో పేర్కొన్నాయి. యూరప్‌లో వరుసగా రెండు రాత్రి ఫ్లైట్లు నిషేధం. అమెరికాలో పైలట్లకు కనీసం 10 గంటల విశ్రాంతి తప్పనిసరి, అందులో 8 గంటలు నిద్ర అవకాశం ఉండాలి. ఒకే ఎయిర్‌లైన్ ఒత్తిడికి గురయ్యే అవకాశమే లేదు. భద్రత రాజీకి గురైనట్లు తెలిస్తే భారీ జరిమానాలు విధించడం అక్కడ సాధారణం. ఇలాంటి సందర్భంలో భారతదేశం ప్రవేశపెట్టిన కొత్త ఎఫ్‌డీటీఎల్ నిబంధనలు కూడా ఈ అంతర్జాతీయ ప్రమాణాల దిశగా అడుగువేసాయి. పైలట్ల వారాంత విశ్రాంతి 48 గంటలు ఉండాలని, రాత్రి పనివేళలను తగ్గించాలని నిర్ణయం తీసుకోవడం భద్రతా కోణంలో అత్యవసరం. కానీ సంక్షోభం మొదలైన క్షణం డీజీసీఏ ఆ నిబంధనలో అత్యంత కీలకమైన భాగాన్ని ఉపసంహరించుకోవడంతో "ప్రయాణికుల ప్రయోజనం కోసమా"? లేక "ఎయిర్‌లైన్ ఒత్తిడి వల్లా"? అనే ప్రశ్నదేశమంతా వ్యక్తమైంది. అలసిపోయిన పైలట్ చేతిలో విమానం అంటే వందలాది ప్రాణాలు ప్రమాదంలో ఉన్నట్లే అని నిపుణుల హెచ్చరిక స్పష్టంగా ఉంది. ఒక ఎయిర్‌లైన్ తన దైనిక కార్యాచరణలో వచ్చిన లోటును నింపేందుకు విశ్రాంతి నిబంధనలను సడలించడమంటే ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటమాడటమే. ప్రపంచ ప్రమాణాలు కఠినతరం అవుతున్నప్పుడు, భారత్ మాత్రం వెనక్కితగ్గడం ఆందోళనకరం. ఇది తాత్కాలికమే అయితే పరవాలేదు. కానీ ఒక్క విమానయాన సంస్థ కోసం మొత్తం వ్యవస్థ భద్రతనే ప్రమాదంలో పడేయడం మాత్రం క్షమించరాని నేరం. అదే సమయంలో, ఈ సంక్షోభం భారత విమానయాన వ్యవస్థలో మరొక బలహీనతను బట్టబయలు చేసింది. విమానయాన రంగంలో ఒక సంస్థ ఏకఛత్రాధిపత్యం వల్ల ఏర్పడిన అత్యయిక పరిస్థితి ఇది. దీన్ని వెంటనే నియంత్రించకపోతే ముస్ముందు పెను ప్రమాదాలను ఎదుర్కోవాల్సివస్తుందని విమానయాన రంగ నిపుణులు హెచ్చరించారు. ప్రస్తుతం ప్రజల మది లో ఒకే భావన పెరుగుతోందిప్రయాణికుల భద్రతను పక్కన పెట్టి, ఒక విమానయాన సంస్థ వ్యూహాత్మక ఒత్తిడికి ప్రభుత్వ నిర్ణయాలు మారితే, భవిష్యత్తులో ఆకాశంలో ప్రయాణీకుల భద్రత పరిస్థితేంటి? దీనికి సమాధానం ఒకటే: ఇండిగో వెంటనే భారీ స్థాయిలో సిబ్బందిని నియమించాలి.

## రైజింగ్ కాదు.. అవినీతి తెలంగాణ

( మొదటిపేజీ తరువాయి )

రేవంత్ రెడ్డి పాలన.. వంచన పాలన తప్పితే మరొకటి కాదని మండిపడ్డారు. రేవంత్ పాలన 420 అని.. ఆయనది ఫేక్ పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 420 హామీలతో రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలను వంచించారని విమర్శించారు. ఈ హామీలపై తెలంగాణ ప్రజలతో పాటు బీజేపీ సైతం ప్రశ్నిస్తోందని స్పష్టం చేశారు. ప్రశ్నిస్తున్న సమాజానికి సమాధానం చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సూచించారు. రేవంత్ రెడ్డికి చిత్త శుద్ధితోపాటు నిజాయితీ ఉంటే ఒక్కొక్క ప్రశ్నకు జవాబు చెప్పాలన్నారు. మోసం చేయడం.. ప్రజల దృష్టిని మళ్లించడం సీఎం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్యని ఎంపీ లక్ష్మణ్ అభివర్ణించారు. రైజింగ్ తెలంగాణ అంటే ఏమిటో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు.

రైజింగ్ తెలంగాణ.. డ్రగ్స్ కల్చర్‌గా మారిపోయిందని, రైజింగ్ తెలంగాణలో గన్ కల్చర్ పెరిగిపోయిందంటూ ఆరోపించారు. పట్టపగలే పోలీసులను కాల్చి పడేస్తున్న పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. పోలీసులకే దిక్కు లేదు, లా అండ్ ఆర్డర్ కుప్పకూలిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గన్, డ్రగ్స్, ఆన్ లైన్ గేమ్, ల్యాండ్ మాఫియా కల్చర్లలో రాష్ట్రం కూరుకుపోయిందన్నారు. రైజింగ్ తెలంగాణ కాదు ఇది అవినీతి తెలంగాణ అంటూ ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రెండేళ్లలో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టుకోలేని భయాందోళనలో కంపెనీలు ఉన్నాయని వివరించారు. హైదరాబాద్ మహానగరం కాంక్రీట్ జంగల్‌గా మారిపోయిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు పాపాలుగా మారి ప్రజలను పీడిస్తున్నాయన్నారు. ఈ రెండేళ్లలో అంతకన్నా రెట్టింపు అప్పులు చేసి.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. అప్పులు పుట్టడం లేదు, చెప్పులు ఎత్తుకు పోయేలా చూస్తున్నారని చెప్పిన రేవంత్.. నేడు గ్లోబల్ సమ్మిట్ పేరుతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామంటే నమ్ముతారా..? అంటూ సందేహం వ్యక్తం చేశారు.





రైజింగ్ తెలంగాణ, గ్లోబల్ సమ్మిట్ తెలంగాణ స్కామ్ ల కోసమే తప్ప మరొకటి కాదన్నారు. రైజింగ్ పేరుతో హైదరాబాద్‌ను ఏం చేయబోతున్నారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. పరిశ్రమల పేరుతో భూములను కాజేస్తామంటే సహించేది లేదని.. అడుగడుగున అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వానికి కళ్లెం వేయాల్సిన అవసరం ఉందని.. లేకపోతే రాష్ట్రం లూటీ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన 420 హామీలపై ప్రజలు ప్రశ్నిస్తుంటే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి పత్త లేరన్నారు. జాతీయ కుల గణన ద్వారానే దేశంలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడతాం.. వేటాడతాం.. విడిచి పెట్టేది లేదంటూ రేవంత్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రేవంత్ సర్కార్‌ను అడుగడుగునా నిలదీసేందుకు సంసిద్ధం కావాలని ప్రజలకు లక్ష్మణ్ పిలుపు నిచ్చారు. కాంగ్రెస్‌ను గద్దె దించే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల్లో ఒక గ్యారంటీ కూడా ఈ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఇంత వరకు ఎందుకు విడుదల చేయలేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో మాఫియా చేతిలో ల్యాండ్ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యులకు మిగిలేది శూన్యమన్నారు. మత రాజకీయాలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి మూడు కోట్ల మంది దేవుళ్లు ఉంటే.. కాంగ్రెస్ పార్టీకి ముగ్గురే దేవుళ్లని.. వారే సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలంటూ వ్యంగ్యంగా వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మత విద్వేషాలు పెరుగుతున్నాయన్నారు. దేశ ద్రోహులను పోషిస్తుందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ నక్సలైట్లను కాంగ్రెస్ పార్టీ పోషిస్తుందని విమర్శించారు.

కేంద్రం ఏమి ఇచ్చిందంటూ అబద్ధాలు చెప్పుతున్నారని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు బీజేపీ చీఫ్. దేశంలోని అన్ని రాష్ట్రాలను కేంద్రం సమానంగా చూస్తుందని గుర్తు చేశారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి కేవలం తన ఇంటి కోసమే పని చేస్తున్నారని ఆరోపించారు. ఈ మహా ధర్నా మహా ధర్మ యుద్ధంగా మారుతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో స్వచ్ఛ లేదన్నారు. రాబోయే మూడేళ్ళు కాంగ్రెస్ పార్టీపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా మారిందని.. ప్రస్తుతం ఆ పార్టీ వీఆర్ఎస్ తీసుకుందని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో ఎక్కడ లంకెబిందెలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి వెతుకుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. అంతేకానీ ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచన చేయడం లేదన్నారు. పరిశ్రమలు మూసేసిన మీరు.. ఎక్కడ ప్రారంభిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలను తరలించి రియల్ ఎస్టేట్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. లంకెబిందెల కోసమే పరిశ్రమలు తరలిస్తున్నారని విమర్శించారు. హిల్ట్ భూముల తరలింపునకు కేంద్ర పర్యావరణ అనుమతులు ఉన్నాయా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశిస్తే.... హిల్ట్ భూముల వాస్తవాలను బయటపెడుతానని స్పష్టం చేశారు. ఈ భూముల విషయంలో పార్టీ ఆదేశిస్తే ఆమరణ దీక్ష చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీ అర చేతిలో స్వర్గం చూపిస్తోందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. కాంగ్రెస్ స్కీమ్‌లో స్కామ్ లు తప్ప మరొకటి లేదని ఎద్దేవా చేశారు. బీసీలను కాంగ్రెస్ పార్టీ నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నైజాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి పాలన అబద్ధాలు, అవినీతి, అరాచకమని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అభివర్ణించారు. సిరి గల తెలంగాణను ఒకరు తాకట్టు పెడితే... ప్రస్తుత సీఎం అమ్మేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ పోరాట పంథా మార్చాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. టెస్టు మ్యాచ్‌లు కాదు ప్రస్తుతం ఉన్న పద్ధతికి అనుగుణంగా మారాలని అభిప్రాయపడ్డారు. అంటే 2020 స్టైల్‌లోకి రావాలన్నారు. 40 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నామని.. ఈ పోరాటాలతో కార్యకర్తలు అలసిపోయారన్నారు. ఇంకా ఎన్ని ఏళ్లు పోరాటం చేయాలంటూ ప్రశ్నించారు. ఎన్ని మ్యాచ్‌లు ఆడామనేది కాదు.. మ్యాచ్ గెలిచామా? లేదా? అన్నదే ముఖ్యమని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి స్పష్టం చేశారు.

## సీఎం రేవంత్‌కి కిషన్ రెడ్డి ఛాలెంజ్

( మొదటిపేజీ తరువాయి )

తెలంగాణ మిగులు రాష్ట్రం కాస్తా అప్పుల రాష్ట్రంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలన మనం చూశామని.. కేసీఆర్ కుటుంబ పాలన ఎంత అవినీతి చేసిందో అందరికీ తెలుసునని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం తెచ్చుకున్న ఈ ప్రత్యేక రాష్ట్రం కేసీఆర్ కుటుంబం చేతిలో ఆనాడు బందీ అయిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయిందని.. హామీలు అమలు చేయకుండానే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పాలన పేరుతో దినోత్సవాలు నిర్వహిస్తున్నారంటూ సీఎం రేవంత్‌పై మండిపడ్డారు.

ప్రజలకు ఏం చేశారని ఈ ఉత్సవాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని కిషన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజలకి ఇచ్చే సన్న బియ్యానికి సైతం కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకి ఇచ్చిన హామీలు నెరవేర్చారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని కేంద్ర మంత్రి నిలదీశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏం మార్పు రాలేదని.. కేసీఆర్ పోయి.. రేవంత్ రెడ్డి వచ్చారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పాలనలో మార్పు లేదు.. దోపిడీలో మార్పు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఈ రెండేళ్లలో అమలు చేసి ఉంటే ఇందిరాపార్క్ వద్ద తనతో చర్చకు వస్తావా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఛాలెంజ్ విసిరారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతుందని.. ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయలేదని, నిరుద్యోగ భృతి రూ.4వేలు ఎందుకు ఇవ్వలేదని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

వృద్ధులు, వికలాంగులకి పెంచి ఇస్తామన్న పెన్షన్లు ఏమయ్యాయంటూ ముఖ్యమంత్రిని ఈ సందర్భంగా కేంద్రమంత్రి నిలదీశారు. ప్రభుత్వ భూములని అమ్మకపోతే పూట గడవని పరిస్థితి సీఎం రేవంత్ రెడ్డిదంటూ ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే బెల్ట్ షాప్‌లు రద్దు చేస్తామన్నారని.. వాటిని ఎందుకు రద్దు చేయలేదని సూటిగా ప్రశ్నించారు. కుటుంబాలను రోడ్ మీద పడేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ ప్రజల ముందుంచిన ఈ మహాధర్నా, కాంగ్రెస్ హామీల మోసం, బీఆర్ఎస్ పాలనలో పెరిగిన అప్పులు వంటి కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. విడుదల



చేసిన ఛార్జ్‌షీట్‌లో 201819 నుంచి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు——మహిళలకు రూ.2,500 సహాయం, రైతులకు రూ.15,000 ప్రోత్సాహకం, యువతకు ఉద్యోగాలు వంటివి ఇప్పటికీ నెరవేరకపోవడాన్ని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా బీజేపీ, తెలంగాణ ప్రజల్లోని అసంతృప్తిని మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు, రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం చర్చనీయాంశమై, ప్రతిపక్షాల నుంచి దీనిపై స్పందన వచ్చే అవకాశం ఉంది.

# ఎక్కడి భూ సమస్యలు అక్కడే!

- తెలంగాణలో భూమి సమస్యల బాధ అంతా ఇంతా కాదు
- దశాబ్దాల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది
- బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో పోర్టల్‌ను తీసుకువచ్చింది
- కాంగ్రెస్ భూభారతి పేరుతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చారు
- అయినప్పటికీ భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు
- 20 లక్షలకు పైగా భూమి సమస్యలు అలాగే పేరుకుపోయాయి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో భూమి సమస్యల బాధ అంతా ఇంతా కాదు. దశాబ్దాల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ఏలికలు ఎవరైనా హాలికులకు కష్టం యథాతథంగా కొనసాగుతూనే వస్తున్నది. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్న నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో పోర్టల్‌ను తీసుకువచ్చింది. దానితో సమస్యలు తీరకపోగా.. మరింత పెరిగాయి. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత భూభారతి పేరుతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చారు. అయినప్పటికీ భూమి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో రైతాంగం నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఎంత మంచి చట్టం వచ్చినా అమలు చేసే అధికార యంత్రాంగంలో చిత్తశుద్ధి లేకపోతే రైతులు, భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదనేందుకు నిదర్శనంగా భూభారతి తయారైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో బీఆరెస్ సర్కార్ తీసుకొచ్చిన ధరణి చట్టం అధికారులను క్లర్క్‌లుగా మార్చిందనే విమర్శలు ఉన్నాయి. సమస్యలను పరిష్కరించే అధికారం అధికారులకు లేక పోవడంతో సమస్యలు పేరుకు పోయాయి. ఇప్పుడు భూభారతిలోనూ యంత్రాంగం నిబద్ధతతో పనిచేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా 20 లక్షలకు పైగా భూమి సమస్యలు అలాగే పేరుకుపోయాయి. దీనికి ప్రధానంగా 2018 తరువాత పాలకుల ఆలోచనల్లో వచ్చిన మార్పులే కారణమని నిపుణులు అంటున్నారు. భూములకు విపరీతంగా రేట్లు పెరగడంతో పాలకులు రంగారెడ్డి జిల్లాను దృష్టిలో పెట్టుకొని నగరం చుట్టూ ఉన్న భూముల కోసమే వ్యవస్థలను ఏర్పాటు చేసి, అధికారాలన్నీ కేంద్రీకరించారు. దీని వల్లే తెలంగాణ రాష్ట్ర రైతాంగం అంతా ఇబ్బంది పడుతున్నారని నిపుణులు అంటున్నారు.

భూమి ఉన్నంత వరకు సమస్యలు వస్తూనే ఉంటాయి. ప్రభుత్వాలు సమస్య ఉత్పన్నం కాకుండా గ్రామస్థాయిలో వాటిని తగ్గించే ప్రయత్నం చేయాలి. అయినా సమస్య వచ్చిందంటే వెంటనే స్పందించి, పరిష్కరించే వ్యవస్థ ఉండాలి.. కానీ దురదృష్టవశాత్తూ ఉన్న వ్యవస్థనే రైతులకు శాపంగా మారింది. సమస్య పరిష్కారం కోసం చేసే ప్రయత్నం ఎంతో కానీ ఉన్న సమస్యను మరింత జటిలం చేస్తున్నారని జనగామ జిల్లాకు చెందిన ఒక రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. 1971 రికార్డ్స్ ఆఫ్ రైట్స్ చట్టం వచ్చిన తరువాత అధికారాల వికేంద్రీకరణ ఉండటంతో ప్రతి సమస్యను తెల్లకాగితంపై దరఖాస్తు చేస్తే అధికారులు పరిశీలించి, విచారణ చేసి నిర్ణయం తీసుకునే వీలుండేది. చాలా మంది రైతులు గ్రామంలో వీఆర్ ఓ తో మాట్లాడుకొని సమస్య పరిష్కారం చేసుకునేవాళ్లు. ఇది నిరంతర ప్రక్రియలా సాగేది. 2020 నవంబర్ 2న అమలులోకి వచ్చిన ధరణి చట్టం అధికారాలను కేంద్రీకరించింది. అప్పటి వరకు గ్రామ స్థాయిలో ఉన్న రెవెన్యూ అధికార వ్యవస్థ (వీఆర్వో)ను రద్దు చేశారు. దీంతో గ్రామానికి వెళ్లి భూమి సమస్య ఏమైనా ఉందా? అని పరిశీలించే నాథుడే లేకుండా పోయాడు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న మూడు రోజులకే భూమి సమస్యలపై నిపుణులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వారం రోజుల్లో కమిటీ వేశారు. అధికారాలను వెంటనే వికేంద్రీకరించి ఆర్డీఓలు, తాసీల్దార్లకు బదలాయించారు. బీఆరెస్ పాలనలో గ్రామాలలో పేరుకు పోయిన భూమి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. కానీ సదస్సులు అసలు జరగలేదు. కారణం ఏమిటో కానీ అధికార వ్యవస్థ ప్రభుత్వ నిర్ణయాలను నిబద్ధతతో అమలు చేయలేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పైలట్ ప్రాజెక్టులు చేపట్టిన చోట్ల కొంత పని జరిగిందని భూమి వ్యవహారాల నిపుణులు చెపుతున్నారు. ఒక వైపు ధరణి చట్టంలోనే కింది స్థాయికి అధికారాలను బదిలీ చేసిన సర్కారు శరవేగంగా 2025 ఏప్రిల్ 14వ తేదీన భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చింది. వెంటనే వర్కింగ్ రూల్స్ కూడా తీసుకు వచ్చారు. భూ భారతి చట్టం పై మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూమి సమస్యలపై గ్రామాలలోనే దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించారు. రద్దు అయిన గ్రామ స్థాయి రెవెన్యూ పరిపాలన వ్యవస్థను పునరుద్ధరించారు. సర్వేయర్ల కొరత నివారణకు ప్రభుత్వం లైసెన్డ్స్ సర్వేయర్ల వ్యవస్థను తీసుకు వచ్చింది. ఇంత వరకు విప్లవాత్మకంగా నిర్ణయాలు తుసుకున్నారు కానీ అమలు తీరు మాత్రం అస్సలు బాగా లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో రేవంత్ సర్కార్ ఫైయిల్ అయిందన్న టాక్ కూడా వచ్చింది.

అధికారులు తీసుకున్న కొద్దిపాటి దరఖాస్తులే లెక్కిస్తే రాష్ట్రవ్యాప్తంగా 8.65 లక్షల వరకూ వచ్చాయని ప్రభుత్వం అధికారికంగా చెప్పింది. దాదాపు 20 లక్షల భూమి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం అధికారాలను వికేంద్రీకరిస్తే.. అధికారులు పరిష్కరించింది చాలా తక్కువ. అందుకే రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు స్వీకరిస్తే తిరిగి ఇప్పటి వరకు మీరేమి చేశారని ప్రశ్నిస్తారని రైతుల వద్ద నుంచి దరఖాస్తులు తీసుకోలేదన్న విమర్శలు వెలువడ్డాయి. అయితే 2025 మే 2వ తదీన భూ భారతిలో 11,630 సమస్యలు పరిష్కరించినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇవి కాకుండా సాదాబైనామా దరఖాస్తులు 9.26 లక్షలు అదనంగా ఉన్నాయి. ధరణిలో అక్రమాలను బయటకు తీసి భూమి దందా చేసిన వారితో ఊచలు లెక్క పెట్టిస్తామని సీఎం రేవంత్ హెచ్చరించారు. ధరణిపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ చేపడతామని 2023 డిసెంబర్ 13వ తేదీన ప్రకటించారు. ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిటింగ్ ఊసే లేదు. ధరణిపై వేసిన కమిటీ ధరణిలో జరిగిన అక్రమాలు, పొరపాట్లపై 1100 పేజీల నివేదికను ప్రభుత్వానికి ఇచ్చింది. కానీ సర్కారు ఈ నివేదికను బయటకు రాకుండా తొక్కి పెట్టిందని అంటున్నారు.

అధికారాల వికేంద్రీకరణ జరిగిన తరువాత కూడా అధికారులు కావాలనే దరఖాస్తులు పరిష్కరించడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కేవలం డ్యాష్ బోర్డు క్లియరెన్స్ ఉండాలన్న తీరుగా అధికారులు ఎలాంటి కారణం లేకుండానే చిన్న చిన్న సాకులతో తిరస్కరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ డ్యాష్ బోర్డులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు? అనే సమాచారం కూడా పబ్లిక్ డొమెన్‌లో ఉంచడం లేదు. భూ భారతి అమలులోకి వచ్చిన తరువాత రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక సభలో మాట్లాడుతూ 2025 ఆగస్టు 15వ తేదీ నాటికి సమస్యలన్నీ పరిష్కరిస్తామని ప్రకటన చేశారు. 2025 నవంబర్ 21వ తేదీ నాటికి కూడా వాళ్లు అధికారికంగా స్వీకరించిన 8.65 లక్షల దరఖాస్తుల్లో 1,11,093 మాత్రమే పరిష్కరించారట. వీటిల్లో కూడా తిరస్కరణకు గురైనవే ఎక్కువగా ఉంటాయన్న సందేహాలు సర్వత్రా వెలువడుతున్నాయి. ఆర్ఎస్ఆర్ మిస్ మ్యాచ్ చూపించి, లెక్కలేనన్ని దరఖాస్తులు రిజక్ట్ చేస్తున్నారు. ధరణిలో లక్షల ఎకరాల పట్టా భూములు ప్రభుత్వ భూములుగా, అసైన్డ్ భూములుగా నమోదు అయ్యాయి. అనేక మంది పేర్లు తప్పు పడ్డాయి. ఎక్సెంట్ మిస్ మ్యాచ్ అయింది. వీటన్నింటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, విచారణ చేసి తప్పులు సవరించాలి. కానీ దీనికి భిన్నంగా అధికార వ్యవస్థ వ్యవహరిస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. చివరకు కోర్టు ఆదేశాలున్న వాటిని కూడా పరిష్కరించడం లేదంటున్నారు. భూమి విలువలు ఎక్కువగా ఉన్న రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, యాదాద్రి తదితర జిల్లాల్లో భూమి సమస్యల పరిష్కారానికి భూమి ధరలో 30 నుంచి 40 శాతం వరకు డిమాండ్ చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఎవరైనా తమకు సమస్య ఉందని అధికారుల వద్దకు వెళితే పై వాళ్లు చెప్పాలని అంటున్నారని బాధితులు వాపోతున్నారు.

తెలంగాణ రాష్ట్రానికి దేశంలో ఏ రాష్ట్రానికి లేనన్ని విప్లవాత్మక భూమి చట్టాలు ఉన్నాయి. కానీ అమలు మాత్రం అంతంత మాత్రంగానే ఉండడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ముఖ్యంగా తెలంగాణలో జాగీర్దార్ అబాలిష్ చట్టం, టెనన్సీ యాక్ట్, భూమి సీలింగ్ చట్టం, ఆర్ ఓ ఆర్ చట్టం, అసైన్డ్ భూముల చట్టం, ధరణి చట్టం,. తాజాగా భూ భారతి చట్టం ఉంది. అమలులో ఉన్న చట్టాలను రెవెన్యూ యంత్రాంగ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతోనే ఆశించిన ఫలితాలు రాక సమస్యలు పేరుకు పోతున్నాయంటున్నారు. ఖరీదైన ప్రాంతాలలో రాజకీయ నేతల జోక్యంతోనూ భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూ భారతి చట్టం ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేంత గొప్పగా తయారైంది. ఎంత మంచి చట్టమైనా అమలు అంత సమర్థవంతంగా ఉంటేనే ఫలితాలు వస్తాయి. ఈ రోజు చట్టం పకడ్బందీగా అమలు జరగాలంటే... చట్టం ఎలా అమలు చేయించుకోవాలనే విషయంలో ప్రజలకు అవగాహన కలిగించాలి. అధికారులకు చట్టం అమలుపై శిక్షణ ఇవ్వాలి. అజమాయిషీ ఉండాలి. ముఖ్యంగా భూమి సమస్యలు చట్టం వెలుగులో గ్రామ స్థాయిలోనే ప్రజల ముందే పరిష్కారం చేయడం కీలకం.

# వెయ్యి అడుగుల లోయలో పడిన కారు

- మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది
- ఈ ఘటనలో ఆరుగుడు మరణించారు
- ఇన్నోవా కారు లోయలో పడిపోయింది
- సప్తశృంగి కోటలోని గణపతి పాయింట్ వద్ద ఘటన
- భక్తులందరూ సప్తశృగి మాత దర్శనం చేసుకొని వస్తున్నారు
- ఈ ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు



**విశాలభారతి, నేషనల్:**

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆరుగుడు మరణించినట్లు అనుమానిస్తున్నారు. నాసిక్ సమీపంలోని సప్తశృంగి కోట వద్ద ఘోర ప్రమాదం సంభవించింది. సప్తశృంగి కోట నుండి వస్తున్న ఇన్నోవా కారు లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించినట్లు సమాచారం అందుతోంది. సప్తశృంగి కోటలోని గణపతి పాయింట్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. రక్షణ గోడలను పగలగొట్టి కారు లోతైన లోయలో పడిపోయింది. ఈ సంఘటనలో సప్తశృంగి మాత దర్శనం చేసుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న ఐదుగురు భక్తులు మరణించినట్లు సమాచారం. ఈ సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే, స్థానికులు, విపత్తు నిర్వహణ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు ప్రారంభించాయి. కానీ లోతైన లోయ కారణంగా, సహాయక చర్యల్లో అడ్డంకులు ఎదురవుతున్నాయి. కారులో ప్రయాణిస్తున్న భక్తులందరూ సప్తశృగి మాత దర్శనం తర్వాత ఇంటికి తిరిగి వస్తున్నారు. అయితే, మార్గమధ్యలో కారు కోట నుండి నేరుగా లోయలో పడిపోయింది. సప్తశృగి గడ్ గణపతి పాయింట్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. అదే సమయంలో, ఈ ప్రమాదం ఎలా జరిగింది? ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఏమిటి? ఇంకా ఎటువంటి సమాచారం బయటకు రాలేదు. అయితే, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. ఇంతలో, ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విపత్తు నిర్వహణ బృందం, స్థానిక పోలీసులు సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ప్రారంభించారు. అయితే, కారు లోతైన లోయలో పడటంతో సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ ప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.

మహారాష్ట్రలో నవంబరు 13 గురువారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. పుణేలోని నవాలే పూల్ ప్రాంతంలో కంటెయినర్ అదుపుతప్పి వాహనాలపై దూసుకెళ్లింది. వేగంగా వెళ్తున్న కంటెయినర్ బ్రేక్ విఫలం కావడంతో ముందున్న 20 నుంచి 25 వాహనాలను ఢీకొట్టింది. ముందు ఒక కారును ఢీకొట్టగా అది మరో కంటైనర్ మధ్య ఇరుక్కుపోయి నుజ్జునుజ్జు అయింది. దీంతో సీఎన్జీ కారు మంటల్లో చిక్కుకుంది. ప్రమాదంలో 8 మంది మరణించగా, 20 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం సతారా నుంచి ముంబైవైపు వెళ్తున్న కంటైనర్ అనేక వాహనాలను ఢీకొట్టింది. తొలుత కారును ఢీకొట్టగా ముందున మరో కంటైనర్ ఉండటంతో మధ్యలో ఇరుక్కుపోయింది. కారులోని సీఎన్జీ సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. దీంతో వెనుక కంటైనర్ కూడా మంటల్లో చిక్కుకుంది. కారు లోపల ఉన్న ఐదుగురు, కంటైనర్‌లోని ఇద్దరు సహా 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి మృతదేహాలను కారు నుంచి బయటకు తీశారు. ఈ ప్రమాదంలో 20 మంది గాయపడ్డారు.

# రేవంత్ రెడ్డిని సాగర్‌లో పడేస్తా

- సీఎం రేవంత్ చేసిన విమర్శలను హరీష్ రావు ఖండించారు
- సిద్దిపేటకు రా రంగనాయక సాగర్‌లో బండ కట్టి నిన్ను ఎత్తేస్తా
- నీళ్లుండి నువ్వు మునిగితే కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నట్టు
- నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ధ్వజమెత్తారు
- మొక్కజొన్న రైతులకు బకాయిలు చెల్లించాలి డిమాండ్ చేశారు
- కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి చేసిన విమర్శలను హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. సిద్ది పేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై అగ్గిమీద గుగ్గిలమయ్యారు. 'సీఎం రేవంత్ రెడ్డి "కాళేశ్వరం కూలిపోయింది... కేసీఆర్, హరీష్ రావులను బండకేసి కొట్టాలి" అంటూ చేసిన వ్యాఖ్యలపై హరీష్ రావు మండిపడ్డారు.

ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డి.. మా సిద్దిపేటకు రా రంగనాయక సాగర్‌లో బండ కట్టి నిన్ను ఎత్తేస్తా. నువ్వు మునుగుతావో.. తేలుతావో చూద్దాం. రంగనాయక సాగర్‌లో నీళ్లుండి నువ్వు మునిగితే కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నట్టు అనుకోవాలి. ఒకవేళ నువ్వు తేలితే కాళేశ్వరం కూలినట్టు" అంటూ హరీష్ రావు సంచలన సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి తప్పుడు మాటలు మానుకోవాలని, నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని హరీష్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

చిన్నకోడూరు మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ముఖ్యంగా, మొక్కజొన్న రైతులకు చెల్లించాల్సిన బకాయిలు, రైతు సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టారు. హరీష్ రావు మాట్లాడుతూ, చిన్నకోడూరు ప్రాంతంలో 450 మంది రైతులకు దాదాపు 59 రోజులుగా రూ. 45 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'మాది రైతు ప్రభుత్వం' అని చెబుతున్నప్పటికీ, ఉత్తమ్ కుమార్ రెడ్డి రెండు రోజుల్లో డబ్బులు వేస్తామని హామీ ఇచ్చి 50 రోజులు గడిచినా చెల్లింపులు జరగలేదని విమర్శించారు. దీంతో యాసంగి పంట పెట్టుబడి కోసం రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధరకే తమ పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న రైతులకు బకాయిపడ్డ రూ. 450 కోట్లు విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతు సంక్షేమ పథకాల గురించి మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు చీరలు ఇచ్చిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని హరీష్ రావు విమర్శించారు. అంతేకాక, రేవంత్ రెడ్డి ఎన్నికలలో ఓటు అడగాలంటే, ముందుగా మహిళలకు బకాయిపడ్డ రూ. 60 వేల రూపాయలను చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు బోనస్ పడాలంటే కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. అలాగే, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, వచ్చే ఏడాది నుంచి పంట వేస్తేనే రైతుబంధు ఇస్తామని ఆయన అంటున్నారని, ఇప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని హరీష్ రావు అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి చేసిన విమర్శలను హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. 'కాళేశ్వరం కూలిపోయింది... కేసీఆర్, హరీష్ రావులను బండకేసి కొట్టాలి' అని రేవంత్ రెడ్డి మాట్లాడారని గుర్తుచేస్తూ, ఆయనకు బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డి సిద్దిపేటకు రా. రంగనాయక సాగర్‌లో బండ కట్టి నిన్ను ఎత్తేస్తా. నువ్వు మునుగుతావో తేలుతావో చూద్దాం. రంగనాయక సాగర్‌లో నీళ్లుండి నువ్వు మునిగితే కాళేశ్వరం ఉన్నట్టు. నువ్వు తేలితే కాళేశ్వరం కూలినట్టు," అని హరీష్ రావు సవాల్ చేశారు. రేవంత్ రెడ్డి మాటలన్నీ అబద్ధాలని, ఆయన చిల్లర మాటలు మానుకోవాలని హరీష్ రావు హెచ్చరించారు.

# సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

- ఓటును అమ్మడం కొనడం చట్టరీత్యా నేరం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పోలీస్ శాఖ పలు సూచనలు
- సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. వెంకట్

**విశాలభారతి మర్పల్లి:**

ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగ అని. గ్రామంలో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నియమాలు పాటించాలని మోమిన్ పెట్ సి ఐ జి వెంకట్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక సంస్థల్లో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు చేశారు. ఎన్నికలు శాంతియుతంగా జరగాలనీ ఎవ్వరూ గొడవలకు అవకాశం ఇవ్వొద్దన్నారు.ఓటు కొనడం అమ్మడం చట్టపరంగా పెద్ద నేరమని ఎక్కడైనా ఇటువంటి ప్రయత్నాలు కనిపిస్తే వెంటనే పోలీసుల కు ప్రజలు సమాచారం అందివ్వాలని కోరారు. రాత్రివేళ గుంపులుగా తిరగడం, మద్యం సేవించి గొడవలు చేయడం పూర్తిగా నిషేధమన్నారు.రాజకీయ ఒత్తిడి, బెదిరింపులు, బలవంతపు చర్యలు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.సోషల్ మీడియాలో పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు వార్తలు వీడియోలు పోస్ట్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మర్పల్లి ఎస్సై అబ్దుల్ రావుప్,ఎంపీడీవో సిటి జయరాం, ఎన్నికల అధికారులు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి 18 వ మహా పడిపూజ

**విశాల భారతీ, అబ్దుల్లాపూర్మెట్ :**

పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధి పసుమాముల గ్రామంలో చెట్టి నవీన్ గౌడ్ (గురుస్వామి) ఆధ్వర్యంలో వారి స్వగృహంలో శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఈదమ్మల్ల బలరాం, మాజీ కౌన్సిలర్ గౌని భాస్కర్ గౌడ్,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డి పాల్గొని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా చెట్టి నవీన్ గౌడ్ మాట్లాడుతూ.. హరిహర పుత్ర అయ్యప్ప శరణం ధర్మ స్థాపనకు, ధర్మ పరిరక్షణకు మార్గం. స్వామి వారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు.ఈ పూజా కార్యక్రమంలో గురుస్వామిలు రమేష్ గురుస్వామి, చెట్టి కుమార్ గురుస్వామి, నరహరి గురుస్వామి, శంకర్ గురుస్వామి, నాగార్జున్ గురుస్వామి, కళ్లెం రవీందర్ రెడ్డి గురుస్వామి, రాజు గౌడ్ గురుస్వామి, వెంకటేష్ యాదవ్ గురుస్వామి, నవీన్ గురుస్వామి, నరేందర్ గురుస్వామి, వెంకటేష్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో మూల కిరణ్ గౌడ్, బాబు గౌడ్, మహేష్ స్వామి, మొగుళ్ళ రాంరెడ్డి తో పాటు పెద్ద ఎత్తున అయ్యప్ప మాలధారులు, అశేష భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి

**తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీశైలం**



**హనుమకొండ:** తెలంగాణ మలిదశ విద్యార్థి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీశైలం అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు ఆదివారం హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ భూమిని గుర్తించి, ఆ భూమిలోకి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకోసం అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేసినప్పటికీ యూనివర్సిటీల కేంద్రంగా విద్యార్థి నాయకులు అనేక పోరాటాలు చేశారన్నారు. అవసరమైనచోట చెమటను, రక్తపుబోట్లను దారబోస్తూ కేసులపాలైన వారి జీవితాలను అంధకారంలోకి వెళ్ళాయన్నారు. విద్యార్థి ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పలివెల్పుల గ్రామ శివారులో బ్రెంకలకుంటకు సంబందించిన ప్రభుత్వ భూమి 16 ఎకరాలు ఉందని, ఆ భూమి కొంతమేరకు కబ్జాకు గురి అయిందన్నారు. కబ్జాదారుల నుంచి ప్రభుత్వం వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకొని విద్యార్థి ఉద్యమకారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోమటిపెల్లి రైల్వే గేట్ వద్ద దేవన్న పేట్ గ్రామ శివారులో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని బడా వ్యక్తులు కబ్జా చేశారని దాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని విద్యార్థి ఉద్యమకారులకు కేటాయించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9 వరకు ప్రభుత్వం నుంచి ప్రకటన రాకపోతే భూ పోరాటాలు చేసి జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలను పంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా నాయకులు మెరుగు రాధకృష్ణ, దయ్యాల నాగరాజు, మౌనిక, హన్మంతచారి, రత్నాకర్, పవన్, పున్నం తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

- కెసిఆర్‌ను ముఖ్యమంత్రిని చెయ్యాలి
- మండలంలోని మాజీ ఎమ్మెల్యే వనమా విస్తృత పర్యటన
- టిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ.వనమా ప్రచారం

**పాల్వంచ, విశాలభారతి :**



ఆదివారం పాల్వంచ మండలంలోని జగన్నాధపురం రంగాపురం పంచాయతీలలో వనమా విస్తృతంగాపర్యటీం చారు.జగన్నాధపురం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ధర్మ సోత్ రమేష్ రంగాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రాధకు మద్దతుగా వనమా ప్రచారంచేశారు.ప్రచారంలో భాగంగా వనమా మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ నేను 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి చేసిన అభివృద్ధిని చూసి మద్దతు ఇవ్వండి.నేను కొత్తగూడెం నియోజకవర్గంలో గతంలో 1 లక్ష పక్క ఇల్లు కట్టిస్తే పాల్వంచ మండలంలోసుమారు 20వేలు ఇల్లులు కట్టించానని అన్నారు. పెద్దమ్మ తల్లి ఉన్న ఈ ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు తో గతంలో అభివృద్ధి చేశాం పెద్దమ్మతల్లి ఆలయం పక్కన రెండు అధున్నతగా ఫంక్షన్ హాల్స్ నిర్మాణం చేశాను ప్రజల కోరిక మేరకు పెద్దమ్మ తల్లి ఆలయం పక్కన శివాలయంలో నిర్మాణం చేయించానని తెలిపారు. కెసిఆర్ హయాంలోనే పంచాయతీలు సుందరవనంగా తీర్చిదిద్దాను పంచాయతీలు, పార్కులు,స్మశానం వాటిక, పారిశుద్ధం ఇంటింటికి మంచినీరు,వీధిలైట్లు రహదారులు ఏర్పాటు అయ్యాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు. నేను గతంలో పంచాయతీ సర్పంచ్ గానే రాజకీయాలకి వచ్చాను 16సంవత్సరాలు పాల్వంచ పంచాయతీ సర్పంచ్ గా పని చేశాం సర్పంచ్ స్థాయి నుండి అంచలంచలుగా 4 సార్లు ఎమ్మెల్యేగా మంత్రిగా ఎదిగాను పాల్వంచ పంచాయతీని ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దా గెలుపు ఓటములు గెలిచినప్పుడు ఎగర వద్దు ఓడినప్పుడు కుంగవద్దు ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజల మధ్యనే ఉండి ప్రజల సంబంధాలను కొనసాగిస్తున్నాం ఎవరిని కుట్రలు కుతంత్రాలు చేసిన భయపడేదే లేదని అన్నారు.చివరి రక్తం బొట్టు వరకు ప్రజాసేవలోనే ఉంటా అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు,పాల్వంచ మండల టిఆర్ఎ పాల్వంచ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పూసల విశ్వనాథం,మల్లెల శ్రీరామ్ మూర్తి,జిల్లా మండల పట్టణ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు స్థానిక నాయకులు ధర్మసూద్ సేవ్య, మంగ్య ధర్మసోద్ చందర్,,,బొంతగాని రవి, ప్రభాకర్ రెడ్డి,శంకర్ రంగాపురం చంద్రగిరి మురళి, రామా, మాలోత్ కిషన్, గుగ్గులోత్ లాలు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ కార్మికుడికి ఆర్థిక సహాయం



**అశ్వాపురం, విశాలభారతి:** మండలంలోని ఆమెర్ద కాలనీకి చెందిన ఇరుగు సాంబశివరావు ఐటీసీ పి ఎస్ పీ డి కర్మాగారంలో బదిలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అయితే ఇతను గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని వైద్య ఖర్చుల కోసం. ఐటీసీ లో పని చేస్తున్న మాదిగ ఉద్యోగులు (ఎం ఈ ఎఫ్) ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అతని స్వగృహానికి వెళ్లి యాభై వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే సాంబశివరావు ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కమిటీ అధ్యక్షులు మిరియాల నరసింహారావు,గౌరవ అధ్యక్షులు చక్కా వెంకటేశ్వర్లు,సీనియర్ నాయకులు కేసుపాక నరసింహారావు, చల్లా వెంకటనారాయణ,కనకం వెంకటేశ్వర్లు, గుర్రం తిరుమలరావు,ఇస్రం శ్రీనివాసరావు, సూదిపాక రాజబాబు,మధు మహారాజ్, కౌలూరి రవి,మిరియాల నాగరాజు, రాగా రవి, చక్కా నాగరాజు,మిరియాల శ్రీనివాసరావు, మిరియాల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

నోట్ ఫోటో ఉంది

## దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- టిజిఎస్ ఆర్టీసీ–ఎన్.ఎం.యు నేతలు

**ఖమ్మం, విశాలభారతి:** టిజిఎస్ ఆర్టీసీ - ఎన్.ఎం.యు యూనియన్ నాయకులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వినాయకరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.టి.రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియా తో మాట్లాడుతూ.. డిసెంబర్ 5న ఖమ్మం టిజిఎస్ ఆర్టీసీ-ఎన్.ఎం.యు ఆఫీస్‌లో జిల్లా రీజినల్ కౌన్సిల్ సమావేశం జరిగిందని, జిల్లాలోని సెక్రటరీలు, ప్రెసిడెంట్లు పాల్గొన్న ఈ సమావేశానికి తెలంగాణ నేషనల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ మౌలానా సహా పలువురు రాష్ట్ర నాయకులు, ఇతర జిల్లాల రీజినల్ కార్యదర్శులు హాజరయ్యారని తెలిపారు. సమావేశం జరుగుతున్న సమయంలో యూనియన్‌కు సంబంధం లేని ఆర్.వి. భద్రం, మరో యూనియన్‌కు చెందిన రిటైర్డ్ వ్యక్తులను వెంట తీసుకొచ్చి ఆఫీస్‌పై దాడి చేసారని పేర్కొన్నారు. జిల్లా సెక్రటరీ ఎల్.ఆర్.కె.రావుపై దాడి చేయడంతో పాటు ప్రాణహానికి గురిచేస్తామని బెదిరింపులు చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తెలంగాణ పోరాటంలో ఆస్తుల రక్షణ కోసం పోరాడిన తమ యూనియన్‌కు చెందిన ఆస్తులను ఆంధ్ర వ్యక్తులకు అప్పగించేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వినాయకరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.టి.రావుతో పాటు జిల్లా డిపో అధ్యక్ష-కార్యదర్శులు డిమాండ్ చేశారు.

## ఘనంగా ముగిసిన పద్మశాలి వనభోజనాలు




**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచ ఆడమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పద్మశాలి వనభోజన కార్యక్రమం ఘనంగా ముగిసింది. పెద్ద ఎత్తున పద్మశాలి సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా కొనసాగింది. వనభోజనాల్లో భాగంగా 25 వసంతాలు పూర్తి చేసుకున్న దంపతులను ప్రత్యేకంగా సత్కరించడం ఈ ఏడాది సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 80 మంది దంపతులకు ఘన సన్మానాలు అందించారు.ఈకార్యక్రమం ఉదయం అల్పాహారంతో ప్రారంభమై, పిల్లలు—పెద్దల కోసం వివిధ రకాల ఆటలు, వినోద కార్యక్రమాలు, చిన్నపాటి పోటీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్యక్రమం అనంతరం పరిచయ సమావేశాలు, విజయోత్సవాలు భక్తి-స్ఫూర్తి వాతావరణంలో జరిగాయి. సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేయగా, టెన్నిస్ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న ఓ యువ క్రీడాకారికి టెన్నిస్ రాకెట్‌ను బహుమతిగా అందించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షిక వనభోజనాలు పరస్పర కలయిక, ఐక్యత, సామాజిక సేవలకు వేదికగా నిలిచాయి.

## ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షల ఫీజు ;పెంపు




**పాల్వంచ, విశాలభారతి:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షల ఎగ్జామ్ ఫీజు చెల్లించుటకు ఈనెల 27వ తేదీ వరకు గడవు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లెర్నింగ్ సెంటర్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పాల్వంచ నందు డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్, తృతీయ సంవత్సరం ఐదవ సెమిస్టర్ కు గాను ఆన్లైన్ రిజిస్ట్రేషన్ మరియు పరీక్ష ఫీజు చెల్లించుటకు ఈనెల 27 వరకు గడువు ఉందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ మరియు కోఆర్డినేటర్ పారెల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 500 రూపాయల ఫైన్ తో జనవరి 2వ తారీఖు వరకు మరియు 1000 రూపాయల ఫైన్ తో జనవరి 7వ తారీకు వరకు ఫీజులను చెల్లించవచ్చని తెలియజేశారు. ఈ సెమిస్టర్ సంబంధించిన పరీక్షలు ఫిబ్రవరి 7వ తారీఖు నుండి ప్రారంభమవుతాయని విద్యార్ధిని విద్యార్థులు అందరూ ప్రతి ఆదివారం జరిగేటువంటి కాంటాక్ట్ క్లాసులకు తప్పనిసరిగా హాజరయ్యి పరీక్షలకు సన్నద్ధం అవ్వాలని ఆమె కోరారు.రిజిస్ట్రేషన్ మరియు ఎగ్జామ్ ఫీస్ చెల్లించుటకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వెబ్సైట్ను సందర్శించాలని తెలియజేయడం జరిగింది.వివరాలకు ఫోన్ నెంబర్:+91 73829 29727 సంప్రదించగలరు.

## పేద చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం నింపిన సాయి సంస్కార్ ఫౌండేషన్




**పాల్వంచ విశాలభారతి:** సాయి సంస్కార్ ఫౌండేషన్ మరియు సుదర్శన ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 50 మంది పేద మరియు సెమీఆనాథ పిల్లలకు స్పోర్ట్స్ టీషర్ట్స్, ట్రాక్ ప్యాంట్లు, మరియు షూస్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్వంచ సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహత్తర కార్యక్రమం కేవలం వస్తువుల పంపిణీ మాత్రమే కాదు, ఆ చిన్నారుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి చేసిన గొప్ప ప్రయత్నం అని, ప్రతి బిడ్డకు ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుందని, ప్రతి చిన్నారిలోనూ అపారమైన శక్తి, ప్రతిభ దాగి ఉంటుంది అని, వారికి సరైన ప్రోత్సాహం, అవకాశం అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారు అని అన్నారు.స్వేచ్ఛ సంస్థ కార్యదర్శి చల్లా కోటయ్య మాట్లాడుతూ మా సంస్థల ద్వారా అందించిన ఈ స్పోర్ట్స్ మెటీరియల్ కేవలం ఒక కానుక మాత్రమే కాదు, ఇది వారి కలల వైపు వేసే మొదటి అడుగు, క్రీడలు వారిని ధైర్యంగా, ఆరోగ్యంగా, మరియు విజేతలుగా మారుస్తాయిఅని అన్నారు. పేదరికం వలన వారి ఆశయాలు మధ్యలోనే ఆగిపోకూడదని వారికి పేదరికం వద్దు రాకూడదని నేటి బాలలే రేపటి పౌరులని వారు వివరించారు. ఈ కార్యక్రమం లో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా

- బిఆర్ఎస్ బలపరిచిన సిపిఐ పార్టీ సర్పంచ్ అభ్యర్థి తెల్లం నాగేంద్ర
- రెండు దశాబ్దాలుగా సిపిఐ పార్టీలో సేవలందిస్తున్న సురేష్
- మీ చెల్లి, అక్కలా ఆదరించండి సేవకురాలుగా మీకు పనిచేస్తా



**అశ్వాపురం, విశాలభారతి :** అనునిత్యం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం తపిస్తూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఇప్పుడు అమెర్ద గ్రామపంచాయతీ ఎన్నికలలో తలపడుతుంది. భారత రాష్ట్ర సమితి (బి ఆర్ ఎస్) పార్టీ మద్దతుతో సిపిఐ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా తెల్లం వారి గుంపు గ్రామానికి చెందిన తెల్లం నాగేంద్రను ఎన్నికల బరిలో నిలిపింది. బీఎస్సీ విద్యనభ్యసించి, పట్టభద్రురాలైన తెల్లం నాగేంద్ర సర్పంచ్ గా నన్ను గెలిపించి అవకాశం ఇయ్యండి అభివృద్ధి చేసి చూపిస్తానంటూ ఓటర్లను వేడుకుంటుంది. అమెర్ద గ్రామపంచాయతీ ప్రజలకు సేవలందించాలన్న లక్ష్యంతో బిఆర్ఎస్ బలపరిచిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉంటూ గ్రామ గ్రామాన ఓటర్లను కలిసి తనకు అవకాశం ఇవ్వండి కమ్యూనిస్టు పార్టీ స్ఫూర్తితో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రజలకు హామీ ఇస్తుంది. ఆమె ప్రచారం చేసిన చోటల్లా ఓటర్లు ఎంతో భవిష్యత్తు ఉన్న ఆమె రాజకీయాల్లోకి రావడం శుభ పరిణామం అని చర్చించుకుంటున్నారు. ప్రజలకు సేవ చేసే దృక్పథం కలిగిన వార్డు సభ్యులు అమెర్ద గ్రామపంచాయతీలో బిఆర్ఎస్, సిపిఐ కలయిక పంచాయతీ ఎన్నికలలో విజయానికి బాటలు వేసేలా ఉంది. సర్పంచ్ ఎన్నికల పొత్తులో భాగంగా వీరు ఎంపిక చేసుకున్న వార్డు సభ్యులందరూ ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం కలిగి ఉండడం మరో విశేషం. ఈ పంచాయతీలో అన్ని గ్రామాలలో ఈ కూటమి బలపరిచిన వార్డు సభ్యులకు ప్రజల నుండి మంచి మద్దతు లభిస్తుంది. ఈ కూటమే వార్డు సభ్యులతో పాటు సర్పంచ్ గెలుపు కూడా సునా యాసమే అవుతుందని ఈ పంచాయతీ లోని ఓటర్లు చర్చించుకుంటున్నారు. అంతకుమించి సిపిఐ పార్టీలో కొన్ని దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటాలు చేస్తూ ప్రజా సేవలో ఉండే అనంతనేనీ సురేష్ అమెర్ద వాసి కావడంతో ఆయన బలపరిచిన అభ్యర్థులకు ఓట్లు వేసేందుకు ఓటర్లు సుముఖంగా ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. ఎవరికి ఆపద వచ్చినా నేనున్నానంటూ వెంటనే వారి సమస్య పరిష్కారం అయ్యేవరకు వారికి తోడుంటూ పరిష్కరించడంలో అనంతనేని అమెర్ద పంచాయతీ ప్రజల మదిలో అభిమానం సంపాదించడం మరో విశేషం. ఈ పంచాయతీ ఎన్నికలలో తాను బలపరిచిన తెల్లం నాగేంద్ర బ్యాట్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్ దేవుళ్లను ఆయన మనస్ఫూర్తిగా వేడుకుంటున్నారు.

## ప్రచారంలో అల్లర్లు సృష్టించవద్దు మునగాల సీఐ రామకృష్ణా రెడ్డి




**కోదాడ, విశాలభారతి:** రెండవ దఫా సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నడిగూడెం మండలం వివిధ గ్రామాలలో ఎన్నికల బరిలో నిలిచిన సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులకు స్థానిక రైతు వేదిక నందు ఎన్నికల నియమావళి పట్ల అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఎమ్మార్వో, ఎస్సై, ఎంపీడీవోలతో కలిసి మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల్లో అంతా ఒక ఊరివారమై పోటీ పడుతున్నామని ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు గ్రహించాలి అన్నారు. మండల పరిధిలో సత్ప్రవర్తన కోసం సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేశామని, బైండోవర్ అనేది కేసు కాదు సత్ప్రవర్తనతో ఉంటానని స్వయంగా రాసి ఇచ్చే హామీ పత్రమని సీఐ తెలిపారు. ప్రచార సమయంలో గొడవలు పెట్టుకోవద్దని వర్గ పోరుకుపోయి చెడ్డ పేరు మూట కట్టుకోవద్దని అన్నారు. ఒకసారి ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే ఎన్నికలు వచ్చిన ప్రతిసారి పోలీస్ స్టేషన్ నందు హాజరు కావాల్సి వస్తుందని గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సమస్యలపై చెన్నగోని తీవ్ర హెచ్చరిక



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ డివిజన్ పరిధిలో చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కాకపోవడం దారుణమని బిఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్ గౌడ్ జీహెచ్‌ఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.మార్నింగ్ వాకింగ్‌లో భాగంగా కాజ్‌బాగ్ బస్తీ పర్యటించిన ఆయన, కాలనీ వాసులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో మౌలిక వసతుల లోపం, రోడ్లు, డ్రైనేజీ, చెత్త నిర్వహణ వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని బాధితులు వెల్లడించారు.హయత్‌నగర్ డివిజన్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు స్పందించడం లేదు. వెంటనే చర్యలు తీసుకోకపోతే తీవ్రమైన ఉద్యమానికి సిద్ధం అవుతాం అని చెన్నగోని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గడ్డం బాలు యాదవ్, ప్రసన్న కుమార్, గంగని నగేష్, చంటి, కర్ణాకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## సంబరాల్లో ఏకగ్రీవ సర్పంచులు



**సింగంపల్లి, విశాలభారతి:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది.మాక్లూర్ మండల పరిధిలోని సింగంపల్లి తండా జాదవ్ శాంత భాయ్(కాంగ్రెస్), గంగారమంద గంగోని శోభరవీందర్(కాంగ్రెస్),అమ్రాద్ తండా మలోత్ నందినిసంతోష్(కాంగ్రెస్),కొత్తపల్లి వేములపల్లి రత్నకుమారి(కాంగ్రెస్), మెట్పల్లి బైరెల్లి పద్మవిజయ్ రావు (కాంగ్రెస్),మాదాపూర్ బేగరీ రవి, ముత్యంపల్లి శెట్టి సుప్రియగంగదర్(బీజేపీ)పోటీ లేకుండానే ఏకగ్రీవంగా సర్పంచ్లుగా ఎన్నుకోవటమే కాదు.. గెలుపు సంబరాలు కూడా చేసుకున్నారు.ఇది ఇలా ఉండగా తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ మూడు విడతల్లో నిర్వహించబోతున్నారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు కూడా ఇప్పటికే అమలులోకి వచ్చింది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించబోతున్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజే కౌంటింగ్ కూడా జరుగుతుంది.అదే రోజున ఫలితం కూడా వెలువబడుతుంది.

## బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్

**మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్**



**కోదాడ, విశాలభారతి :** మునగాల మండలం, మాధవరం గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేస్తూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఏలక వెంకట రెడ్డి, మాధవరం గ్రామ శాఖ అధ్యక్షులు ధార వెంకన్నలను కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి గౌరవనీయులు బొల్లం మల్లయ్య యాదవ్ గారీ ఆదేశానుసారం బిఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ మునగాల మండల అధ్యక్షులు తొగర్ రమేష్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఏ పదవిలో ఉన్న నిర్ధాక్షణంగా పార్టీ నుండి బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు.

## శాంతి ర్యాలీ నిర్వహించిన పోలీసులు




**నిజామాబాద్, విశాలభారతి:** రాబోయే పంచాయతీరాజ్ ఎన్నికలు నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోమాక్లూర్ పోలీస్ స్టేషన్ హద్దులలో ఉన్న మాక్లూర్ మండలంలో కల్లడి గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రజల్లో నమ్మకం పెంపొందించడం , శాంతి భద్రతలు కాపాడడం మరియు ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడం లక్ష్యంగా నిర్వహించబడింది. మాక్లూర్ పోలీసు స్టేషన్ సిబ్బందితో పాటు అదనపు బలగాలు కూడా పాల్గొని గ్రామస్థులకు శాంతి పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రజలందరూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి ఎన్నికల నియమాలను పాటించి ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడటం లేదా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘణ వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిజామాబాద్ కమిషనరేట్ ఈ ప్రాంతంలో స్వేచ్ఛాయుత , నిష్పక్షపాతంగా, శాంతియుత ఎన్నికలు నిర్వహించడానికి కట్టుబడి ఉంది అని తెలియజేశారు. కార్యక్రమంలో ఏసిపి వెంకట్ రెడ్డి, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, మాక్లూర్ ఎస్ఐ, నవీపేట్ ఎస్ఐ 5వ టౌన్ ఎస్ఐ రాజశేఖర్, తిరుపతి, గంగాధర్, మొగులయ్య, సుమారు 50మంది సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్ పదవులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్న కాంగ్రెస్



**కోదాడ, విశాలభారతి:** మోతె మండల వ్యాప్తంగా 29 గ్రామ పంచాయతీలకు 7 గ్రామ పంచాయతీలు, రాయికుంట తండా, రాంపురం తండా, విబలాపురం, మావిళ్ళగూడెం, బల్లు తండా, లాల్ తండా, గోల్ తండా గ్రామాలు ఏకగ్రీవంగా కాంగ్రెస్ కైవసం చేసుకుందనీ కీసర సంతోష్ రెడ్డి మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అన్నారు. ఏకగ్రీవానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నా హృదయ పూర్వక ధన్యాదములు తెలియజేశారు. మిగిలిన గ్రామాలలో కూడా కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో మంచి మెజారిటీ తో గెలిచి మన ప్రియతమ రాష్ట్ర మంత్రివర్యులు మరియు కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి గార్లకు బహుమతిగా అందించి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతామని వారు అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపాలన

**నెమలి అనిల్ కుమార్**



**నాచారం, విశాలభారతి:** బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ లోని స్వామి వివేకానంద నగర్ కాలనీ ఫేజ్ 3 లో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ కాలనీ వాసులతో కలిసి పర్యటించి కాలనీలో ఉన్న ప్రధాన సమస్యలను అడిగి తెలిసుకున్నారు,ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారం తో కాలనీ లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సానాల రవికుమార్ ,ప్రధాన కార్యదర్శి పైళ్ల శ్రీనివాస్,ఉపాధ్యక్షులు పల్లె శివ గౌడ్,సంయుక్త కార్యదర్శులు పైళ్ల గౌతమ్,అరుణ్ కుమార్,కాలనీ సభ్యులు రాములు గౌడ్,దయాకర్,నవీన్ , సైదులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నాగారంలో పర్యటించిన జాగృతి అధ్యక్షురాలు కవిత

- అయితే నాలా క్లిన్ చేయాలి లేదా రేవంత్ రెడ్డి ఇక్కడ ఉండాలి
- కాలనీలో తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు



**కీసర, విశాలభారతి :** నాగారం భవానీ నగర్ లో పర్యటించిన జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట కవిత ఆదివారం పర్యటించారు.ఘనంగా స్వాగతం పలికిన జాగృతి నాయకులు ప్రజలు. వర్షం పడితే చాలు పాలు కాలనీలు అన్ని ముంపు గురవుతాయి అట్టి నాలాను పరిశీలించిన కవిత అనంతరం అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సంధర్బంగా కవిత మాట్లాడుతూ ఎలక్షన్స్ లో ఓట్లు వేసుకొని ఎమ్మెల్యేలు అవుతారు మంత్రులు అవుతారు కానీ ప్రజల సంక్షేమం విషయంలో ప్రజలను మార్చిపోతున్నారు అని అన్నారు.అలాగే మీరు కూడా పని చేసే నాయకులను ఎన్నికల్లో గెలిపించుకోవాలి అని ప్రజలకు సూచించారు.ఈ మురికి కాలువ చూస్తుంటే నాకే చాలా బాధగా ఉంది ఇండ్ల మధ్యలో నుండి వెళ్తుంటే మురికి వాసనకు పిల్లలతో ఎలా ఉంటున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడు మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ లో కలిపారు కదా ఇకనైన అభివృధి మంచిగా చేయాలి అని ప్రభుత్వని కోరారు. ముఖ్యంగా నాగారం,దమ్మాయి గూడలో డ్రైనేజీ వసతి లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న ఎంపీలు రేవంత్ రెడ్డి, మల్లారెడ్డి సహా చాలా మంది నాయకులు వచ్చి చూసి పోయారు కానీ ఫలితం లేకుండా పోయింది.కానీ ఇక్కడ చెరువు బాగు చేయలేదు,డ్రైనేజీ అవుట్ లెట్ చేయించలేకపోయారు అని అన్నారు.డ్రైనేజీ మంజూరు అయ్యిందని చెబుతున్నారు ఐతే వెంటనే పనులు ప్రారంభించాలి అని ప్రభుత్వని డిమాండ్ చేశారు.ఇక ఇక్కడ చాలా మంది జనాభా ఉన్నారు కానీ ఒక రేషన్ షాప్ లేదు ప్రజా ప్రభుత్వం అంటున్నారు కానీ ప్రజల సమస్యపై దృష్టి పెట్టడంలేదన్నారు.ఊరు పెద్దదిగా అయిన ఇంకా ఒక్క ప్రాథమిక పాఠశాలానే ఉంది అది కూడా ప్రధాన రహదారి దాటి పిల్లలు వెళ్లాల్సి వస్తోంది అని అన్నారు. వెంటనే రేషన్ షాప్,స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వనీ డిమాండ్ చేశారు.ఇక వర్షకాలం వస్తే ముంపు సమస్య ఉంటోంది.కొంచెం వాన వస్తే జనం బయటకు పోలేని పరిస్థితి మళ్లీ వానాకాలం వచ్చే లోపు సమస్య పరిష్కరించాలి అని కోరారు.ప్రజలకు బస్తీ దవాఖానా లేక ప్రైవేట్ హాస్పిటల్ కు వెళ్లాల్సి వస్తోంది.వెంటనే బస్తీ దవాఖానాను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.నేను ఉన్న ఈ భవానీ నగర్ ప్రాంతంలో వారానికి ఒకసారి కూడా మంచి నీళ్లు రావటం లేదు అంటా సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ అంటూ ఊదరగొడుతున్నారు. ముందు ఇక్కడ రోజు మంచి నీళ్లు వచ్చేలా ఏర్పాటు చేయాలి అలాగే పైప్ లైన్ లేని చోట పైప్ లైన్ వేయాలి నీళ్ళు అవసరం ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలి ప్రభుత్వాని కోరారు.

## 6 గ్యారెంటీలపై సీఎం రేవంత్ చర్చకు రావాలని తోకల శ్రీనివాస్ రెడ్డి




**రాజేంద్రనగర్, విశాలభారతి:** రెండేళ్ళుగా అమలు కాని హామీల కోసం ప్రజా వంచన కాంగ్రెస్ పాలనని నిరసిస్తూ చేస్తున్న బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి రాజేంద్ర నగర్ అసెంబ్లీ నియోజక వర్గ ముఖ్య నాయకులతో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ కెసిఆర్ హయాంలో పాలనలో నియంత పాలన కొనసాగిందని పేర్కొన్నారు.తెలంగాణ ప్రజల కలలన్నీ కెసిఆర్ కుటుంబం బాగుపడ్డదని అలాగే కాంగ్రెస్ పార్టీ ఏంచేసింది అని విజయోత్సవాలు చేస్తోందన్నారు. ఏం మొహం పెట్టుకొని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని డిమాండ్ చేయడం జరిగింది. అదే విధంగా కాంగ్రెస్ గ్యారెంటీలపై సీఎం రేవంత్ రెడ్డి చర్చకు రావాలని బీజేపీ పార్టీ డిమాండ్ చేయడం జరిగింది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు అనేక హామీలు ఇచ్చి వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు అన్ని నిచితంగా గమనిస్తున్నారని రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం ఖచ్చితంగా చెప్తారని ఆయన పేర్కొన్నారు.

## గల్లంతైన గ్యారెంటీలు.. నెరవేరని హామీలు

- ఇంద్రపార్క్‌లో బీజేపీ మహా ధర్నా
- హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి




**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** రాష్ట్రంలో గల్లంతైన గ్యారెంటీలు, నెరవేరని హామీలు, అవినీతి పాలనను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు పిలుపు మేరకు ఇంద్రపార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ భారీ మహా ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలు ఇప్పటికీ కాగితాలపైనే ఉన్నాయి. ప్రజల కోసం చేస్తామని చెప్పి ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని అప్పుల బారిన పడేసింది అని అన్నారు. అదేవిధంగా రైతుల సమస్యలు పరిష్కారం కాలేదు, యువతకు ఉద్యోగాలు లేవు, పేదలకు వాగ్దానం చేసిన పథకాలన్నీ నిలిచిపోయాయి. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రస్తుత పాలకుల వైఫల్యం స్పష్టమైంది అని విమర్శించారు.ప్రజల కోసం నిజంగా పని చేసే శక్తి భారతీయ జనతా పార్టీయే. అభివృద్ధి, పారదర్శక పాలన, ఇచ్చిన మాట నిలబెట్టేది బీజేపీ మాత్రమే. రాంచందర్ రావు నేతృత్వంలో జరుగుతున్న ఈ పోరాటంలో భాగమవడం నా బాధ్యతగా భావిస్తున్నాను అని తెలిపారు.ఈ కార్యక్రమం లో హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, భాస్కర్ గౌడ్, ఎర్ర శ్రీకాంత్, బిజెపి పార్టీ రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకెళ్తున్న పోలాస్ భరత్



**విశాలభారతి, మర్పల్లి:** గ్రామ అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మదుగు రామేశ్వర్ కత్తెర గుర్తుకు, తొమ్మిదవ వార్డ్ నుండి మెంబర్ గా పోటీ చేస్తున్న పోలీస్ భరత్ గ్యాస్ పొయ్యి గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని పోలాస్ భరత్ కోరారు. ఆదివారం 9వ వార్డులో ప్రచారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. వార్డ్ లోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఏ సమస్య వచ్చినా తీర్చడానికి ముందుంటానని ఓటర్లకు తెలిపారు. గ్రామ ప్రజలు సర్పంచ్ గా మదుగు రామేశ్వర్ ను కోరుకుంటున్నారని భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు. ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు బిత్తర పోతున్నారన్నారు. ప్రజలు యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని కోరారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**సికింద్రాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు ని కలిసి తెలంగాణ ఉద్యమకారుల పోరాడ సమితి నాయకుడు మల్లారి అనిల్ కుమార్ వి నతి పత్రం ఇవ్వడం జరిగింది. అందులో అంశాలు 250 గజాల స్థలం పెన్షన్, గుర్తింపు కార్డు ఇవన్నీ ఇప్పుడున్న కాంగ్రెస్ గవర్నమెంట్ మేనిఫెస్టో పెట్టడం జరిగింది. ఇప్పటికీ రెండు సంవత్సరాలుగా పైననే అయింది ఉద్యమకారుల ఇచ్చిన హామీల కోసం ఇప్పటివరకు కార్యచరణ మొదలు పెట్టలే అందుకోసం ఆదివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రన్నకి తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి నుండి లెటర్ ఇవ్వడం జరిగింది. మీరు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలకు గవర్నమెంట్ తో మీరు వెంటనే అమలు చేయాలని గవర్నమెంట్ పై ఒత్తిడి తీసుకురావాలని ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన వైఫల్యం పై ప్రశ్నిస్తున్న తెలంగాణ పేరిట ఈరోజు బిజెపి మహా ధర్నాలో కార్యక్రమంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## అధ్యక్ష పీఠం గౌడీ అమర్నాథ్ కైవసం




**కూకట్ పల్లి, విశాలభారతి:** మేడ్చల్‌మల్కాజిగిరి మాలజంగం మహేశ్వర సంఘం (202527) నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం బాలానగర్‌లోని రాజు కలనీ జిహెచ్ఎంసి కమ్యూనిటీ హాల్‌లో ఉత్తేజభరిత వాతావరణంలో జరిగాయి. సార్వత్రిక ఎన్నికలను తలపించేలా పెద్ద సంఖ్యలో సంఘం సభ్యులు తరలిరావడంతో పోలింగ్ కేంద్రం సందడిగా మారింది. ఈ ఎన్నికలకు తెలంగాణ రాష్ట్ర మాలజంగం మహేశ్వర సంఘం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బాల సిద్దయ్య, అడ్వైసర్ పురం శివశంకర్, ప్రధాన కార్యదర్శి తాలూకా రాజశేఖర్ పర్యవేక్షణలో రాష్ట్ర అధ్యక్షుడు పర్స శ్యామ్ రావు ప్రధాని ఎన్నిక అధికారిగా వ్యవహరించారు.

**హోరాహోరీ పోరు, 56 ఓట్ల తేడాతో విజయం**

సంఘంలో మొత్తం 480 కుటుంబ ఓట్లు ఉండగా, 321 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవుల కోసం మొత్తం రేండు ప్యానెళ్ల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఈ పోరులో బాలానగర్ నివాసి గౌడీ అమర్నాథ్ నేతృత్వంలోని ప్యానెల్ విజయం సాధించింది. అమర్నాథ్ తన సమీప ప్రత్యర్ధి అయిన బొబ్బిలి రమేష్ పై 56 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా మాదరి రవి శేఖర్ 164 ఓట్లతో గెలుపొందారు. అనంతరం ఎన్నికల అధికారి గౌడీ అమర్నాథ్‌తో మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా సంఘం అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు.

**సభ్యుల సంక్షేమమే లక్ష్యం: గౌడీ అమర్నాథ్**

ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గౌడీ అమర్నాథ్ మాట్లాడుతూ.. ఎన్నికలలో పాల్గొని తనను బలపరిచిన ప్రతి ఒక్క సభ్యునికి ధన్యవాదాలు తెలిపారు. సంఘం సభ్యుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సభ్యుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అలాగే, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. మాలజంగం మహేశ్వర సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరి సహకారం అవసరమని అమర్నాథ్ ఈ సందర్భంగా కోరారు.

## డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ డివిజన్‌లోని మహా గాయత్రీనగర్ కాలనీలో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న కొత్త సీసీ రోడ్ ప్రారంభోత్సవం, అలాగే ₹20 లక్షల రూపాయల (ఎంపీ నిధులతో) కమ్యూనిటీ హాల్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలకు నిరంతరం సహకారం అందిస్తున్న మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధి మాది మొదటి లక్ష్యం. ప్రజలు ఏ సమస్య చెప్పినా తక్షణమే స్పందిస్తూ, అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నాం. కాలనీ వారీగా రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇంతకాలంగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల్లో కూడా ఇప్పుడు పనులు వేగంగా జరుగుతున్నాయి అని తెలిపారు.అదనంగా డివిజన్‌కు మరిన్ని నిధులు తీసుకువచ్చి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మేము కట్టుబడి ఉన్నాం. ప్రజల విశ్వాసం మా బలం... అభివృద్ధితో ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం అని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దేవి సింగ్, ప్రధాన కార్యదర్శి మాలిగ లింగం కురుమ, కోశాధికారి పి. మధు, ఉపాధ్యక్షులు చుక్కా రెడ్డి, భగవంతు గౌడ్, రఘునాథ్ ప్రసాద్, సోమయ్యచారి, శ్రీనివాస్ యాదవ్, రమేష్, వేణుగోపాల్ రెడ్డి, సుజాత, శ్రీదేవి, ఉమాకాంత్, హరి, రవీందర్, రవి, భద్రం, శంకర్, నరేందర్ రెడ్డి, బీజేపీ నాయకులు ఎర్ర శ్రీకాంత్, బాలు నాయక్, ప్రేమ్, అఖిల్, ప్రణవ్ తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఓరుగల్లు కోటను సందర్శించిన వరంగల్ జూనియర్ సివిల్ జడ్జి

**విశాలభారతి, వరంగల్:** చారిత్రిక ప్రసిద్ధి గాంచిన ఓరు గల్లు ప్రాంతాన్ని ఆదివారం వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజ దంపతులు, కుటుంబ సభ్యులు సందర్శించడం జరిగింది.ఈ సందర్బంగా కోట లోని అద్బుత కళా ఖండాలను చూసుకుంటూ కాకతీయులనాటి చరిత్రను పర్యాటక శాఖ గైడ్ రవి యాదవ్ ద్వారా తెలుసు కోవడం జరిగింది.ఎంతో వైభవం కలిగిన ఓరుగల్లు కోట చరిత్రను తెలుసు కుంటూ నల్లరాతి శిల్పాలను అద్భుతం అని జడ్జ్ వారి కుటుంబ సభ్యులు అద్భుతం అని కొనియాడారు.కోటలో ఉన్న ఏకశిల, కుష్ మహల్,అక్కా చెల్లె బావులు, శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్నటువంటి శత్రుముక లింగాన్ని దర్శించుకోవడం జరిగింది.అందులో ఉన్న పెద్ద నందిని శివాలయంలో పూజలు చేశారు. కాకతీయ రాజుల చరిత్రతో పాటు కళాఖండాలను చూసి వాళ్ళు గైడ్ రవి యాదవ్ తో కోట ప్రాంతాన్ని సందర్శించిన వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజ దంపతులు ఎంతో వైభవం కలిగిన ఏకశిలా రాతి కోట,మట్టి కోట, నీటికోట వాటితో పాటు రాతికోట చుట్టూ ఉన్నటువంటి అనేకమైన దేవాలయల చరిత్ర తెలుసుకొని వెళ్లారు.



## కరాటే పోటీల్లో స్టూడెంట్స్ కోకో ఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులకు పతకాలు



**కోదాడ, విశాలభారతి:** ఖమ్మం పట్టణంలో ఆదివారం సుమన్ ఫోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30వ నేషనల్ ఛాంపియన్షిప్ కరాటే పోటీల్లో కోదాడ పట్టణ శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన స్టూడెంట్స్ కోకో ఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి గోల్డ్ సిల్వర్ బ్రాంచ్ మెడల్స్ కైవసం చేసుకున్నట్లు కోచ్ మాధవి లత ఆదివారం తెలిపారు. తమ క్లబ్ నుండి నిహార్,నిశాంత్, నోహిత్, గోల్డ్ మెడల్స్ ఈశ్వర్ అంజలి, శిరీష లు గోల్డ్ మెడల్స్, గుణ సాయి విజయ రవళి లు సిల్వర్ మెడల్స్, విక్రాంత్, వెంకట నిహాల్, నికిత బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. విజేతలకు మెడల్స్ ప్రశంసా పత్రాలను కరాటే కింగ్ సినీ నటుడు సుమన్, తెలంగాణ జూడో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జల్లెల శ్రీనివాసరావులు అందజేసి విజేతలను అభినందించినట్లు తెలిపారు. కోదాడ పట్టణంలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణను ఇస్తూ జాతీయస్థాయిలో మెడల్స్ సాధించేందుకు ప్రోత్సహిస్తున్న స్టూడెంట్ కోఫో ఖాన్ క్లబ్ కోదాడ కోచ్మాధవి లత ను ప్రశంసించారు.జాతీయస్థాయిలో మెడల్స్ సాధించిన విద్యార్థులను కోదాడలో పలువురు అభినందించారు.

## స్టేషన్ ఘణపూర్‌లో జిల్లా మేరు సంఘం సమావేశం



**జనగాం, విశాలభారతి:** జనగామ జిల్లా మేరు సంఘం కమిటీ నెలసరి మండల సమావేశం మేరు భవనం స్టేషన్ ఘణపూర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు రాపర్తి ప్రశాంత్ పాలుగొని మొదట మేరుకుల దైవం శంకర్ దాసమయ్య చిత్రపటానికి పూలమాల వేశారు. తదనంతరం మాట్లాడుతూ, ఏ ప్రభుత్వం సహాయం లేకుండా స్వయంకృషితో సభ్యులందరూ కలిసి గత కొద్ది సంవత్సరాల క్రితం భూమి కొనుగోలు చేసి ఉన్న స్థలంలో కొద్దిపాటిగా భవనం నిర్మించుకున్న ఘనత స్టేషన్ గణపురం మండల మేరు సంఘం సభ్యులకే ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చిందని, ప్రశంసించారు.ఈ కమిటీ హాలును మరింత అభివృద్ధి చేసుకునేందుకు సభ్యులంతా ముందుకు రావాలని సూచించారు. ఇప్పటివరకు ప్రభుత్వం మేరుకులానికి అభివృద్ధి కోసం పెద్దగా సహాయ సంహారం లభించకపోవడంతో ఇప్పటికైనా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందెందుకు కులం పెద్దలు రాజకీయంగా కొనసాగుతున్న మన కులస్తులందరూ,గట్టిగా పోరాడి సహాయం పొందడానికి ఈ ఎన్నికల సమయం వచ్చిందని అధ్యక్షుడు రాపర్తి ప్రశాంత్ పేర్కొన్నారు.

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం, కురవి మండలం నల్లెల గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు గుండెబోయిన సూరయ్య యాదవ్ ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నేడు వారిని స్వగృహంలోనే పరామర్శించిన మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు. తరువాత ఆమె గ్రామంలోని బీఆర్ఎస్ నాయకుడు నరాటి కంఠ్లం గౌడ్ నివాసానికి చేరుకుని, ఆయన మనవరాలు సంజనను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో హృదయపూర్వకంగా మాట్లాడిన సత్యవతి రాథోడ్, గ్రామాభివృద్ధిపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమాలలో బీఆర్ఎస్ నాయకులు ఐలి నరహరి గౌడ్, అర్జున్ చౌహన్, చంద్రారెడ్డి, ముస్తాఫా, సంజీవ, కృష్ణామూర్తి, గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బండి దీపక్ గౌడ్, శ్రీనివాస్, సత్తిరెడ్డి, కరుణాకర్, ఉప్పలయ్య, కృష్ణ, మంగిలాల్, మల్లయ్య, వెంకట నర్సింహారెడ్డి, రాజు, రాంబాబు, రాములు, ఉప్పలయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## 41 రోజు సేవ చేసిన భక్తురాలికి స్వాముల సత్కారం

- పెద్ద తండా రామ మందిరంలో భక్తి సందడి



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్ద తండా రామ మందిరంలో ఆదివారం భక్తి గోష్ఠి వాతావరణం నెలకొంది. గత 41 రోజులుగా స్వామివారికి నిరంతర సేవలు అందించిన భక్తురాలు భారతికి ఆలయ కమిటీ తరఫున స్వాములు సత్కారం నిర్వహించారు. దేవాలయం అభివృద్ధికి తన శ్రమను అంకితం చేసిన భారతి భక్తి భావాన్ని గుర్తించి, ఆమెకు రూ. 2901 ఆర్థిక సహాయంతో పాటు పట్టు వస్త్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరిపాక సతీష్ ఆచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీర్వాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ఆరిపాక సతీష్ ఆచార్యులు, స్వాములు మాట్లాడుతూ "భారతి సేవా ధోరణి యువతకు ఆదర్శం. స్వామి సేవలో నిస్వార్థంగా పనిచేసే భక్తులను మరింతగా ప్రోత్సహిస్తాం" అని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సేవలో ఉన్న ప్రతి ఒక్కరికి స్వామివారి కృప ఎల్లప్పుడూ ఉంటుందని అర్చకులు ఆరిపాక సతీష్ ఆచార్యులు ఆశీర్వదించారు.

## కార్పొరేటర్‌ను కలిసిన హైడ్రా బాధితులు

- హైడ్రా బాధితులకు అండగా ఉంటాం అధైర్య పడొద్దు



**కాప్రా, విశాలభారతి:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కమల బాయి నగర్, దుర్గా నగర్ లో హైడ్రా కూల్చివేతల్లో ఇల్లు కోల్పోయిన బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎవరు కూడా ఆ ధైర్యం పడకూడదని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి హైడ్రా బాధితులకు ధైర్యం చెప్పారు. హైడ్రా కూల్చివేతలో ఇల్లు కోల్పోయిన వారందరూ మల్లాపూర్ వార్డు కార్యాలయంలో పన్నాల దేవేందర్ రెడ్డిని కలిసి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. కష్టపడి ప్లాట్లనుకుని ఇల్లు కట్టుకొని జీవిస్తుంటే హైడ్రా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఇళ్లను కూల్చివేసిన విషయంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారీ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, మంత్రులు, అవసరమైతే ముఖ్యమంత్రి కూడా కలిసి మాట్లాడుతామని హైడ్రా బాధితులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

# 25శాతం జనాభా ఉన్న కులానికి రిజర్వేషన్ కరువాయే...!

- యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోల్నేపల్లిలో వింత పరిస్థితి
- ఎస్సీ కులాలను గుర్తించని అధికారులు, పార్టీలు, గ్రామంలోని పార్టీ పెద్దలు
- 10 వార్డులలో ఒక్క స్థానం కూడా అవకాశం లేకపాయే
- జనరల్ స్థానాలలో కూడా ఎస్సిలకు దక్కని చోటు
- రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం కాలరాస్తున్నవైనం







**యాదాద్రి, విశాలభారతి:** యాదాద్రి జిల్లా వలిగొండ మండలం గోల్నేపల్లి గ్రామంలో ఎస్సి వర్గానికి చెందిన కులాలు రెండు ఉండగా 25శాతం ఓట్లు ఉన్నాయి.అయితే ఆ కులాన్ని గుర్తించేందుకు అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేశారో ఏమో కానీ ఎస్సీలకు తీరని అన్యాయం చేశారు.ఒక్కటంటే ఒక్క వార్డు మెంబర్ రిజర్వేషన్ కూడా కల్పించకుండా వ్యవహరించారు. కనీసం పోటీలో ఉన్న పార్టీలు కూడా జనరల్ స్థానాలలో అయినా ఒక్క ఎస్సికి టికెట్ కేటాయించలేదు అంటే ఎస్సీ వర్గాలు అంటే గోల్నేపల్లి గ్రామంలో పార్టీలకు కానీ పార్టీల పెద్దలకు కానీ ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుంది. ఎలక్షన్స్ రాగానే అన్న జర నన్ను మరవకే నేను నిలబడుతున్న, అక్క జెర నన్ను పర్చిపోకు, కాకా మన పోరలకు చెప్పు అన్నకే ఓటెయ్యాలని అంటూ పోటీలో నిలబడిన వారి ప్రచారం అయితే... మనోడిని నిలబెట్టిన అన్నింటికీ నేనే ఉంటా అంటూ గ్రామంలో అధికారం కోసం తిష్ట వేసిన బడా నాయకులు ఎస్సి కాలనీలను పట్టి తిరుగుతూ ఓట్లు అడుగుతున్నారు. అంటే ఎస్సీ వర్గీయుల ఓట్లు తప్ప వాళ్లకు సీట్లు ఇచ్చే చిత్తశుద్ధి వారికి లేకపాయే..ఇక్కడ మరోటి ఉంది. గ్రామానికి బిసి మహిళ రిజర్వేషన్ రావడంతో సర్పంచ్ గా నిలబడే అవకాశం కోల్పోయాము అధికారం లేకపోతే ఎట్లా.. మనది ఎట్లున్నా అప్పర్ హ్యాండ్ ఉండాలని ఓ వర్గం బడా నాయకులు జనరల్ స్థానంలో గెలిచి ఉప సర్పంచ్ స్థానాన్ని చేజిక్కించుకునే స్వార్ధ ప్రయోజనంతో ఆ స్థానంలో ఎస్సిలకు స్థానం కల్పించకుండా తమ సామాజిక వర్గానికి ఇరు పార్టీల నుండి టికెట్ ఇప్పించుకొని కుటిల రాజకీయం చేస్తున్నారు. ఎస్సీలు ఓట్లకే తప్ప సీట్లకు పనికిరారు అన్నట్లుగా తమ కులం కోసం స్వార్ధ రాజకీయాలు చేస్తున్నారు. సరే ఎస్సీల మీద తమకు ఎలాంటి నిర్లక్ష్యం లేకపోతే గ్రామంలో ఐదు జనరల్ స్థానాలు వచ్చాయి.అందులో ఎందుకు ఏ ఒక్క స్థానంలోనైన ఎస్సీ వర్గాలకు అవకాశం కల్పించలేదు.ఎందుకంటే ఎస్సీ వర్గం అంటే వారికి ఎనలేని నిర్లక్ష్యం.అధికార దాహంతో ఉన్న బహుముఖ పెద్దమనుషులను నమ్మి వెంట తిరిగే ఎస్సి వర్గాలు నిరాశతో ఏమీ ప్రశ్నించలేని దీన స్థితిలో ఎందుకు ఉన్నారు. మాకెందుకు స్థానం కల్పించరు అని ఎందుకు ఎదురుతిరగడం లేదు...చదువు ఉంది, ఆలోచన ఉంది. పాలించే సత్తా ఉంది మరి మేము దేనికి తక్కువ అని ఎందుకు ప్రశ్నించడం లేదు.ఓట్లకు తప్ప సీట్లకు పనికి రారు అని నిర్ధారించి తమ స్వార్ధ ప్రయోజనాల కోసం తమ వెంట ఎస్సీ వర్గాలను తిప్పుకుంటున్న ఆ నాయకులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎందుకు గుర్తించడం లేదు. ఏ నాడైన అడగనిదే చిన్న లైట్ వేసిన పరిస్థితి లేదని గుర్తుంచుకోవాలి. పరిస్థితి చేయిజారిపోయింది. కానీ ఇప్పటికైనా మేల్కొనండి. రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా హరిస్తూ ఎస్సీ వర్గాలకు రిజర్వేషన్ రాకుండా తప్పులు తడక రిపోర్టులు ఇచ్చి ఈ పరిస్థితి రావడానికి కారుకులైన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామంలో ఉన్న కొంతమంది డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామాలు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి.**



**పరకాల , విశాలభారతి:** గ్రామాలు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పరకాల ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పరకాల మండలంలోని కామారెడ్డి పల్లి, అలియాబాద్, పోచారం,వెల్లంపల్లి, హైబోతుపల్లి,,వెంకటాపురం, లక్ష్మీపురం, పైడిపల్లి,నాగారం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకై ప్రచారాన్ని నిర్వహించారు. అంతకముందు గ్రామాల్లోని ప్రజలు డప్పు చప్పుళ్ళు, కోలాటాలు, డీజే లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామాల్లో ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకే ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా మనం చేసిన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై నమ్మకం కలిగిందన్నారు.సోనియా గాంధీ, రాహుల్ గాంధీ , మల్లిఖార్జున ఖర్గే నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, మహిళలకు ఉచిత బస్సు, 500లకే గ్యాస్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రెండు లక్షల రుణ మాఫీ, వరికి రూ.500 బోనస్, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్ వంటి పథకాలు చెప్పి ప్రజలను ఓట్లు అడగాలన్నారు.

## జీపీ మొదటి విడత ఎన్నికలకు సిద్ధం కావాలి

- ఓటర్ స్లిప్పుల పంపిణీ నేటితో పూర్తి కావాలి
- ప్రతి మండలానికి రెండు హరిత పోలింగ్ కేంద్రాలు
- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ , విశాలభారతి:** జిల్లాలో మొదటి విడతలో జరుగబోయే గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికలకు అన్ని విధాల సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఈ నెల 11న వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాల్లో జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల పోలింగ్ కౌంటింగ్, తదితర ఏర్పాట్లపై వరంగల్ కలెక్టరేట్ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ బాక్సులు, బస్సులు, పోలీసు బందోబస్తు, ఫోటో, ఓటర్స్ స్లిప్పుల పంపిణీ ఈ నెల 8వ తేది లోగా పూర్తి కావాలన్నారు. ప్రతి మండలానికి రెండు హరిత పోలింగ్ కేంద్రాలు ఉండేటట్లు చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఓటర్లు వారి ఓటు హక్కును ఎటువంటి ఇబ్బంది లేకుండా వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. శానిటేషన్, ర్యాంపులు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలను ముందుగానే పరిశీలించాలన్నారు. పోలింగ్ రోజు ప్రతి స్థాయిలో సమన్వయం పటిష్టంగా ఉండాలని, ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతం, పారదర్శకత, సమర్థతకు కట్టుబడి సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిపిఓ కల్పన, మండల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు ఎంపిడిఓ లు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ తొలి తరం స్వయం సేవక్ రేవాజీ


- ఆయన లేరనే వార్త చాలా బాధించింది
- రేవాజీ కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్..

**వరంగల్ , విశాలభారతి:** వరంగల్ జిల్లాలో ఆర్ఎస్ఎస్ తొలి తరం స్వయం సేవక్ రేవాజీ(రేవా కోటేశ్వరరావు) అని, ఆయన లేరనే వార్త తనను చాలా బాధించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల మరణించిన ఆర్ఎస్ఎస్ జేష్ఠ కార్యకర్త రేవాజీ కుటుంబాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తో కలిసి పరామర్శించారు. ఆదివారం వరంగల్ డాక్టర్స్ కాలనీలోని రేవాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రేవాజీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో ఆర్ ఎస్ ఎస్ తొలి తరం స్వయం సేవక్ అయిన రేవాజీ లేరనే వార్త తనను చాలా బాధించిందన్నారు. సంఘ్ విస్తరణ కోసం 65 సంవత్సరాలు ఎనలేని కృషి చేశారని తెలిపారు. వరంగల్ మహబూబియా హైస్కూల్ లో హిందీ పండిట్ గా పనిచేస్తూ వరంగల్ డాక్టర్స్ కాలనీలో స్థిరపడ్డారని చెప్పారు. సూర్యాపేటలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ గా పనిచేశారని,. ఆ తర్వాత వరంగల్ జిల్లా ఆర్ఎస్ఎస్ కార్యవాహ గా, బౌద్ధిక్ ప్రముఖ్ గా, విభాగ్ కార్యవాహగా, విభాగ్ సంఘచాలక్ గా, ప్రాంత సహ కార్యవాహగా, ప్రాంత కార్యకారిణి సభ్యులుగా పనిచేశారని పేర్కొన్నారు.



## పల్లెల్లో ప్రచారాల హడావిడి

- మద్దతును కూడగట్టేందుకు కుల సంఘాలకు గాలం
- పగలంతా పొలంలో సాగు పనులు.. రాత్రి ప్రచారంతో బిజబీజీ
- విమర్శలు.. ప్రతి విమర్శలతో హీటెక్కుతున్న పల్లె రాజకీయం





**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:** పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రచార సందడి కనిపిస్తుంది. తొలివిడత , రెండో విడత, మూడో విడతలలో ఎలక్షన్ కమిషన్ ఎన్నికల నిర్వహిస్తుండగా ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మూడో విడత ఈ నెల 17న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ ల ప్రక్రియ పూర్తి అయ్యింది. ఇక మిగిలింది ఎన్నికల గుర్తులు రావడమే ఎన్నికల గుర్తులు కేటాయిస్తే గ్రామాల్లో ప్రచారం మరింతగా ఊపందుకుంటుంది. ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్ , వార్డు అభ్యర్థులు ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు స్థానిక ఎన్నికలో పోటాపోటీగా వారివారి ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేస్తూ దూసుకు పోతున్నారు. ఆకట్టుకునే విధంగా ప్లాన్ చేస్తున్నారు. సర్పంచ్ పదవులతో పాటు వార్డు మెంబర్ పదవులకు తీవ్రమైన పోటీ కనిపిస్తుంది. ఈసారి యువకులే ఎక్కువగా పంచాయతీ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామ అభివృద్ధిని చేసి చూపుతామంటూ నమ్మబలుకుతున్నారు.

## శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి పొన్నం



**కీసర, విశాలభారతి :** కీసర గుట్ట శ్రీ భవాని సమేత రామలింగేశ్వర స్వామిని ఆదివారం ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు.ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.ఆలయంలో ఆయన రామలింగేశ్వర స్వామివారికి అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో మంత్రికి శాలువ కప్పి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సంధర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వేముల వాడ రాజా రాజేశ్వర్ స్వామి వారిని దర్శించుకున్న సంతోషం ఉందన్నారు.ఇక్కడ కొండపైన స్థలం చాలా వరకు విశాలంగా అలాగే ప్రశాంతమైన వాతావరణం కూడా ఉందన్నారు. కీసర గుట్టను మరింత అభివృద్ధి చేసే ఆలోచన కూడా ఉంది అని తెలిపారు.రాష్ట్రం బాగుండాలి అని అలాగే రాష్ట్ర ప్రజలు బాగుండాలి అని కోరుకున్న అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నారాయణ శర్మ,జిల్లా అధ్యక్షుడు తోటకూర జంగయ్య యాదవ్ కాంగ్రెస్ నాయకులు,ఫౌండర్ సభ్యులు,ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ డంక మోగనున్నది



- సంక్షేమ పథకాలే ప్రచార అస్త్రాలు
- కాంగ్రెస్ పార్టీలో చేరిన భూచన్పల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకులు
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్

**మర్పల్లి, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు దాదాపు ఖరారు అయిందని మండలంలో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భూచన్పల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు మరి కింది మల్లయ్య, ఎక్కిల్లి రవి, పట్లూర్ లక్ష్మయ్య, గొల్ల కిష్టయ్య, మరి కింది యేసయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ బుచన్పల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో కండవా కప్పుకొని చేరారు. సందర్భంగా మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ మాట్లాడుతూ..మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలపొందనున్నట్లు ధీమ వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలే ప్రచార అస్త్రాలుగా వాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీలోని నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో మండలం అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవరాజ్ సుదర్శన్ శ్రీనివాస్ రెడ్డి బలవంత్ రెడ్డి, రాజు కిష్టయ్య హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు

## రాకేష్ దత్తాను పరామర్శ

- సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు చంటి ముదిరాజ్




**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 10వేల కోట్ల నిధుల విడుదలను డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేపట్టి అనారోగ్యం పాలైన విద్యార్థి నాయకుడు రాకేష్ దత్తను సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డా. చంటి ముదిరాజ్ పరామర్శించారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడకుండా తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలి అని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పాదయాత్ర చేసిన రాకేష్ దత్త అనారోగ్యం పాలవడం బాధాకరమని పేర్కొంటూ, రాకేష్ దత్త పోరాటం ఆగదు. అతని ఉద్యమానికి మా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ పూర్తి మద్దతు ఉంటుంది. త్వరలో సెక్రటేరియట్ ముట్టడికి సిద్ధంగా ఉన్నాం అని చంటి ముదిరాజ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ ఉపాధ్యక్షులు గోపీనాథన్ కట్టెకోల, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, రాష్ట్ర కార్యదర్శి అజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి దీపక్ కుమార్, ఖమ్మం బీసీ టౌన్ ప్రెసిడెంట్ గోనె ముదిగొండ పవన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రచారం


- బ్రహ్మరథం పడుతున్న గ్రామస్తులు



**విశాలభారతి, మర్పల్లి:** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మధుగు రామేశ్వర్, ప్యానెల్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఆదివారం హనుమాన్ మందిరం నుండి ప్రారంభమైన ప్రచార కార్యక్రమం గ్రామంలోని చర్చి, మసీదు, దేవాలయాల్లో పూజలు నిర్వహించి వందలాది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులతో కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీతో ప్రతిపక్ష నాయకులకు ఎటు తోచడం లేదు. దీంతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపు ఖాయం అయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామ అభివృద్ధి మదుగు రామేశ్వర్ తోనే సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

## మర్పల్లి ఐటిఐ లో జాతీయ అప్రెంటిషిప్ మేళా

- ఐటిఐ పూర్తిచేసిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి
- ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి




**విశాలభారతి, మర్పల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు ఐటిఐ పూర్తిచేసిన అభ్యర్థులకు జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ డి.తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అప్రెంటిషిప్ మేళా లో ప్రఖ్యాత మహీంద్రా అండ్ మహీంద్రా, ఎంఆర్ఎఫ్, కార్తికేయ ఇండస్ట్రీస్, రానే కంపెనీ, పవర్ మేక్, పెన్నార్ ప్రైవేట్ లిమిటెడ్ లు కంపెనీలు పాల్గొంటున్నాయనీ, ఈ అవకాశాన్ని ఐటిఐ పూర్తిచేసిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఈ నంబర్స్ కి 8500463608/8500463686 సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## గ్రామ అభివృద్ధి కొరకు ఆశీర్వదించండి

- మొదటి వార్డ్ నుండి మెంబర్ గా పోటీ చేస్తున్న అభ్యర్థి తలారి తిరుపతి కవిత



**విశాలభారతి మర్పల్లి:** గ్రామ అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మధుగు రామేశ్వర్ కు కత్తెర, మొదటి వార్డు నుండి మెంబర్ గా పోటీ చేస్తున్న తలారి తిరుపతి కవిత కు గౌను గుర్తులకు, తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని మొదటి వార్డ్ నెంబర్ తలారి తిరుపతి కవిత కోరారు. మొదటి వార్డులో ఎలాంటి సమస్య వచ్చిన ముందుండి పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను ప్రభుత్వాన్ని దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాగునీరు, మురికి కాలువల శుభ్రత, విద్యుత్ స్తంభాలలో దీపాలు ఏర్పాటు చేయడం తదితర వంటి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రతి ఒక్కరికి అన్ని సౌకర్యాలు అందేటట్లు చూస్తానని ప్రజల ఆశీర్వాదం ఇవ్వాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరు కత్తెర గౌను గుర్తులకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రార్థించారు.

## ఇంద్ర పార్క్ వద్ద ధర్నాకు తరలిన బిజెపి శ్రేణులు




**సికింద్రాబాద్, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గ్యారెంటీలను నెరవేర్చకుండా కాలయాపనా చేసిందని బిజెపి సీనియర్ నాయకుడు రవి ప్రసాద్ గాచేసిందని బిజెపి సీనియర్ నాయకుడు రవి ప్రసాద్ గౌడ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు బౌద్ధ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ ద్వారా ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ లో పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో.. రవి ప్రసాద్ గౌడ్,మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ , సత్యనారాయణ, దత్తు, లడ్డు, నాగరాజు, ఓంలు, రూప్,సాయి, నర్సింగ్ కుమార్, సినిమా రాజు, సుశీల, నాగమణి, నవీన్, ఉమాపతి,సురేష్, లింగం,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం అందజేత




**కోదాడ, విశాల భారతి:** వాసవి క్లబ్ కోదాడ ఆధ్వర్యంలో ఆదివారం నాడు బొడ్ల నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శనగల రాధాక్రిష్ణ మానసిక వికలాంగుల అనాథ ఆశ్రమంలోని పిల్లలకు ఆదివారం మధ్యాహ్న భోజనాన్ని అందించటం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు సేకు శ్రీనివాసరావు మాట్లాడుతూ వివాహ వార్షికోత్సవ వేడుకలు అనాథ పిల్లల మధ్య చేసుకోవటం అభినందనీయం అని, వారి దంపతులకు వారి కుటుంబానికి వాసవి అమ్మవారి ఆశీస్సులు సదా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమం లో వాసవి క్లబ్ అధ్యక్షులు సేకు శ్రీనివాసరావు, కార్యదర్శి పత్తి నరేందర్, కోశాధికారి వెంపటి ప్రసాద్, డిపిఓ ఇమ్మడి సతీష్ బాబు, బొడ్ల వెంకటేష్, అనధాశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అనంతపురం పిల్ల అల్లాడిస్తుందిగా

అచ్చ తెలుగు అందం ప్రియాంక జవాల్కర్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న షార్ట్ ఫిల్మ్స్ ద్వారా కెరీర్ ని ప్రారంభించి టాక్సీవాలా అనే సినిమాతో టాలీవుడ్ కి పరిచయమయ్యింది ప్రియాంక. ప్రియాంక .. మొదటి సినిమానే విజయ్ దేవరకొండ సరసన నటించడమే కాకుండా భారీ విజయాన్ని అందుకొని టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. అమ్మడి అందానికి ఫిదా అయిన ప్రేక్షకులు టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ అవుతుందని అనుకున్నారు. కానీ, టాలెంట్ తో పాటు లక్ కూడా ఉంటేనే స్టార్ అవుతారని ప్రియాంక విషయంలో రుజువు అయ్యింది. ప్రస్తుతం ప్రియాంక చిన్న చిన్న రోల్స్ లో, క్యామియోస్ లో కనిపిస్తూ అభిమానులను అలరిస్తుంది. సినిమాలు పక్కన పెడితే సోషల్ మీడియాలో అమ్మడి హల్చల్ అంతా ఇంతా కాదు. నిత్యం హాట్ హాట్ ఫోటోషూట్స్ తో కుర్రకారుకు కునుకు లేకుండా చేయడంలో ప్రియాంక ముందు ఉంటుంది. తాజాగా రెడ్ కలర్ బాడీ కాన్ డ్రెస్ లో అమ్మడి అందాల ఆరబోత అదిరిపోయింది. ఎద అందాలను ఆరబోస్తూ కవ్వించే లుక్ తో మెస్మరైజ్ చేసింది. ప్రస్తుతం ప్రియాంక ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.